
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 16 జూన్ 2024

- ప్రతి ఒక్కరి రియల్ హీరో ఆయనే! • కనిపించే దైవం.. మార్గదర్శకుడు

నాన్నకు ప్రేమతో..



ఓర్పునకు మారుపేరు.. మార్పునకు మార్గదర్శి.. నీతికి నిదర్శనం.. ప్రగతికి సోపానం.. క్రమశిక్షణకు చిరునామా.. మొదటి స్నేహితుడు.. ఆత్మబంధువు.. శ్రేయోభిలాషి... గురువు... దైవం.. నేస్తం.. త్యాగమూర్తి.. కష్టజీవి.. రోల్‌మోడల్.. ఇలా అన్నీ నాన్నే. అవుతాడు.. ఆడిస్తాడు.. నడిపిస్తాడు.. నడవడిక నేర్పుతాడు.. నేనున్నానంటూ ధైర్యాన్ని ఇస్తాడు.. భయం వద్దని భరోసా నింపుతాడు.

నాన్న... రెండక్షరాల పదం. కానీ ఈ రెండక్షరాల్లోనే జీవితం మొత్తం దాగుంది. ప్రతి అబ్బాయికి మొదటి హీరో తండ్రి అయితే, ప్రతి అమ్మాయికి మొదటి స్నేహితుడు నాన్నే. తల్లి 9 నెలలు కడుపులో పెట్టుకుంటే మిగిలిన జీవిత మంతా తండ్రి తన భుజాలపై పెట్టుకుంటాడు. ఇలా నాన్న గురించి చెప్పుకుంటూ పోతే పదాలు చాలవు. అటువంటి తండ్రి కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించడం మన అదృష్టం. అంతటి గొప్ప తండ్రికి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే ఫాదర్స్‌డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..


- నెల్లూరు (విద్య/ఆంధ్రజ్యోతి బృందం)

భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు!



ఆడపిల్లలమనే ఆలోచన, భయం కలగకుండా మా భవిష్యత్తుకు భరోసాగా మా నాన్న అన్నీ తానై వ్యవహరించారు. దగదర్తి మండలం ఉలవపాళ్ల మా ఊరు. నాన్న సంజీవరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ వజ్రమ్మ. నలుగురు ఆడబిడ్డలు, ఒక మగ సంతానం. కానీ ఆడమగ తేడా లేకుండా అందరినీ సమానంగా పెంచారు. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు ఆడపిల్లలకు విద్యే ఆభరణమని నమ్మిన వ్యక్తి మా నాన్న. కన్నపిల్లలతోపాటు వేలాదిమంది విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దారాయన. సమాజంలో మాకు లభిస్తున్న గౌరవాన్ని చూసి సంజీవరావు పిల్లలమని గర్వంగా చెప్పుకుంటాము. ఒక స్నేహితుడిగా, మార్గదర్శిగా నిలవడం వల్లే మేమంతా ప్రయోజకులుగా స్థిరపడ్డాము.

- కోండ్రు సౌజన్య, సీడీపీఓ, కావలి



నా మొదటి గురువు ఆయనే!



మా నాన్నే నా మొదటి గురువు. మాది అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం వేపగుంట గ్రామం. నాన్న కే నాగానందం బీఈడీ చదువుకుని ట్యూషన్ చెబుతూ అంచెలంచెలుగా ఎదిగి నాలుగైదు గ్రామాల్లో ప్రైవేట్ స్కూల్స్ నడిపే వారు. 7వ తరగతి వరకు మా నాన్న దగ్గరే చదువుకున్నా. ఆ తర్వాత ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో చదివాను. కొడుకు కన్నా మిన్నగా నన్ను చూసుకుని చదివించారు. నాన్న కోరిక మేరకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసినా.. పేదలకు మరింత సేవ చేయాలనే నాన్న ఆశయంతో గ్రూప్-1కు సిద్ధమయ్యాను. 2013లో మొదట గ్రూపు-1 సాధించా. 2016లో గ్రూపు-1కు ఇంటర్వ్యూ వరకు వెళ్లా. 2019-20లో గ్రూపు-1 నోటిఫికేషన్ వచ్చింది. అప్పటికే నాకు వివాహమైంది. నాన్న ఆశయం, నా భర్త సాయికుమార్ కుటుంబ సభ్యుల సహకారంతో పట్టుదలతో పరీక్షలకు హాజరయ్యాను. సత్యసాయి జిల్లాలో మొదట ఏడాది శిక్షణ, ఆ తర్వాత 2023లో ఆర్డీవోగా ఆత్మకూరులో బాధ్యతలు తీసుకున్నాను. నా ఉన్నతి కారణమైన మా నాన్న స్ఫూర్తిగా సేవా, సంస్కారం అబ్బాయి. ప్రయోజకురాలినై పది మందికి సేవ చేయాలన్నదే ఆయన ఆశయం. ఆ దిశగానే అంకితభావంతో నా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. నా ఉన్నతికి ఎంతో శ్రమించినా మా నాన్నగారు 2009లో చనిపోయారు. అప్పటి నుంచి మా అమ్మ అన్నీ తానై తండ్రి లేనిలోటు తీర్చింది. నా ఉన్నతికి కారణమైన నాన్నకు ప్రేమతో ధన్యవాదాలు.

- కె మధులత, ఆర్డీవో, ఆత్మకూరు

పిల్లలు వేసే ప్రతి అడుగు వెనుకే ఉంటాడు. తప్పటడుగులు వేసే వయసు నుంచి తప్పుడు అడుగులు వేసినా వెంట ఉండి మంచి మార్గాన్ని చూపించేది తండ్రే. తన పిల్లల కోసం ఏం చేయడానికైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఎంతకష్టం వచ్చినా ఆ కష్టాన్ని పిల్లలకు తెలీయకుండా పెంచుతాడు. వారికోసం తన సర్వస్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడతాడు. తాను ఏ పరిస్థితుల్లో ఉన్నా పిల్లలు ఏదైనా గొప్పపని చేశారని తెలిస్తే చాలు తనకున్న బాధలన్నిటినీ మరచిపోయి ఆనందంగా గడిపేస్తాడు. ఏ కుటుంబానికైనా ధైర్యాన్ని, ఆసరాన్ని కల్పించేది మాత్రం నాన్న మాత్రమే. నాన్న అన్నీ సమకూరిస్తే వాటిని పిల్లలకు అందించేది అమ్మ. జీవన ప్రయాణంలో తనకు ఎదురయ్యే కష్టాలను తన పిల్లలకు కన్పించకుండా ఉండేందుకు నాన్న పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. బాధలతో గుండె బరువెక్కిన క్షణంలో కన్నీళ్లు వరదలా వస్తున్నా వాటిని కనురెప్పలచాటున దాస్తాడే తప్ప బయటకు కనిపీయడు.



నాన్న ప్రేరణతోనే..

నాన్న ప్రేరణే నన్ను ఈస్థాయికి చేర్చింది. మాది గుంటూరు జిల్లా తెనాలి. నాన్న కృష్ణారెడ్డి రిటైర్డు హెడ్‌మాస్టర్. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు అయినా అందరినీ సమానంగా పెంచి విద్యాబుద్ధులు నేర్పించి, ప్రయోజకులను చేశారు. అన్నయ్య చెన్నైలో ఉండగా, చెల్లి డాక్టర్. నేను మాత్రం నాన్నను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. ఎంఏ బీఈడీ చేసి 1998లో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరాను. ఆ తర్వాత గ్రూప్-2లో ఎంపికై డీఎల్‌పీవో స్థాయికి ఎదిగాను. తండ్రి ప్రేరణతోపాటు ఆయన ప్రతి విషయంలో మా వెనుక ఉండి మంచి నడవడికలతో మమ్మల్ని తీర్చిదిద్దారు. మా నాన్నకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

- రాధామాధవి, డీఎల్‌పీవో, కావలి

- ఫాదర్స్ డేకు నాంది..

ప్రాంతాలు వేరైనా.. దేశం ఏదైనా బిడ్డల కోసం తండ్రి పడే తపన మాత్రం ఒక్కటే. బిడ్డల ఎదుగుదల కోసం చేసే త్యాగం ఒక్కటే..దాన్ని గుర్తించి వందనం చెప్పడం కోసమే ప్రపంచమంతా ఫాదర్స్‌డే జరుపుకుంటుంది. తండ్రి త్యాగాలను కొనియాడుతుంది. పిల్లల ఎదుగుదల కోసం తల్లిదండ్రులు పడే తపన అంతాఇంతా కాదు. కానీ తల్లికి లభించినంత గుర్తింపు తండ్రికి లభించలేదు. ఇలాంటి ఆలోచన ఓ అమ్మాయి మదిలోకి రావడంతోనే వచ్చింది ఫాదర్స్‌డే...

వాషింగ్టన్‌కు చెందిన సోనారాకు 6 నెలల వయసులోనే తల్లి చనిపోయింది. జోలపాటల నుంచి గోరుముద్దలు తినిపించే వరకు సర్వస్వం నాన్నే అయ్యారు. తల్లి రూపం కూడా తెలియని ఆ చిన్నారికి నాన్న హెన్నీజాక్సన్ పడిన తపన, కష్టం తెలుసు. తన కోసం నాన్న చేసిన త్యాగాలూ తెలుసు. అందుకే 27 ఏళ్ల వయసు వచ్చేసరికి నాన్నకు ఓ గుర్తింపు ఇవ్వాలన్న ఆలోచన ఆమెలో బలపడింది. ఆ అమ్మాయి దృఢసంకల్పం వల్ల 1910, జూన్‌లో తన తండ్రి హెన్నీజాక్సన్ పుట్టిన రోజున ఫాదర్స్‌డేగా ఊపిరిపోసుకుంది. తనతండ్రి పుట్టిన రోజు మాత్రమే కాదు ప్రపంచంలోని తండ్రులందరికీ గుర్తింపు తేవాలన్న లక్ష్యంతో పోరాటం మొదలుపెట్టింది సోనారా. చివరకు 1910 జూన్ 19న ప్రపంచంలోనే మొదటిసారిగా అమెరికాలో ఫాదర్స్‌డే వేడుకలు జరిగాయి. 1916లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉండ్రోవిల్సన్ జూన్ 3వ ఆదివారం ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించుకునేందుకు ఆమోదం తెలిపారు.

ఫాదర్స్ డే వేడుకలను ప్రపంచమంతా నిర్వహిస్తున్నా వివిధ కారణాల వల్ల దీన్ని ఒకేరోజు జరుపుకోవడంలేదు. ఏ దేశంలో ఎప్పుడు జరుపుకున్నా నాన్నకు పెద్దపీటనే వేసి గౌరవిస్తున్నారు. తండ్రికి ఉన్న ప్రాముఖ్యతను చాటుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా మీ నాన్న మీ కోసం చేసిన త్యాగాలను స్మరణకు తెచ్చుకుని ఆరాధించండి. కనీసం ఈ ఒక్కరోజైనా తండ్రితో కలిసి ఆనందంగా గడుపుతారని, గడపాలని ఆశిద్దాం.

ఎరువుల ఫ్యాక్టరీ వద్దే వద్దు!

- ముక్తకంఠంతో వ్యతిరేకించిన గ్రామస్థులు
- వారి అభిప్రాయాలు ఆలకించని అధికారులు
- మొక్కుబడిగా సాగిన ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు, వివరణ ఇస్తున్న ఫ్యాక్టరీ నిర్వాహకులు



మాట్లాడుతున్న గ్రామస్థులు

ఉలవపాడు, జూన్ 15 : తమ బతుకులు బుగ్గిపాలు చేసే ఎరువుల తయారీ ఫ్యాక్టరీ వద్దేవద్దంటూ ఉలవపాడు, రాజుపాళెం గ్రామస్థులు తేల్చి చెప్పారు. అయితే, వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా అధికారులు వెళ్లిపోవడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని కూడా మొక్కుబడిగా నిర్వహించారంటూ మండి పడ్డారు. ఉలవపాడుకు చెందిన వైసీపీ నాయకుడి కుమారుడు జాతీయ రహదారి పక్కన తనకున్న 2.91 ఎకరాల్లో రూ.9.7 కోట్లతో ఏడాదికి 1.2 లక్షల టన్నుల ఉత్పత్తి కలిగిన ఎరువుల తయారీ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారు. ఏ రకం ఎరువులు తయారు చేస్తారు? దానివల్ల సంభవించే కాలుష్య ప్రభావంపై గ్రామస్థుల్లో నెలకొన్న ప్రశ్నలకు ఎవరూ నివృత్తి చేయలేదు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ప్రాంతంలో జిల్లా కాలుష్య నివారణ బోర్డు ఈఈ చింతపల్లి రాజశేఖర్, కందు కూరు ఇన్‌చార్జి ఆర్డీవో శీనా నాయక్ (కావలి), ఇన్‌చార్జ్ తహసీల్దారు గుడ్లూరు ఏవీ రమణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముందుగా సింగిల్ సూపర్ పాస్ఫేట్ తయారీ ద్వారా వచ్చే వ్యర్థాలను రీసైకిల్ విధానంలో శుద్ధి చేస్తారని, భూ కాలుష్యం కాకుండా ప్రత్యేక పద్ధతిలో చర్యలు తీసుకుంటారని ఫ్యాక్టరీ నిర్వాహ కులు వివరణ ఇచ్చారు. ఉలవపాడు, రాజుపాలెం గ్రామస్థులు వీటన్నిటిపై అనుమానాలు ఉన్నాయని, గ్రామ సమీపంలో ఫ్యాక్టరీ ఉన్నందున గాలిలో విషవాయువులు వెలువడతాయని, భూసారం, మట్టి కలుషితం అవుతాయని అధికారులను నిలదీసేందుకు ప్రజాభిప్రాయవేదిక వద్దకు భారీగా తరలివెళ్లారు. ప్రతిరోజు ఎరువుల తయారీకి సుమారు 2 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుంది. భూగర్భ జలాలు వాడేపనైతే చుట్టు పక్కల మామిడి తోటలకు, రాజుపాలెం, ఉలవపాడు గ్రామాలకు భూగర్భ జలాలు ఇంకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కాలుష్య నియంత్రణ అధికారులు మాత్రం అక్కడకు విచ్చేసిన సామాజిక కార్యకర్తలు, పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, స్థానికంగా వైసీపీ నాయకుల అభిప్రాయాలు చెప్పిన వెంటనే కార్యక్రమం ముగిసిందని మమనిపించి వెళ్లిపోయారు. గ్రామస్థులు తమ అభ్యర్థనలను అర్జీల రూపంలో విన్నవించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఆర్డీవో, పొల్యూషన్ బోర్డు ఈఈ హడావుడిగా వెళ్లిపోయారు. చివరకు ఇన్‌చార్జ్ తహసీల్దారు రమణకు అర్జీలు ఇచ్చారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా ముందస్తు ప్రణాళిక మాదిరి ఒక గంటలో కార్యక్రమం ముగించుకొని అధికారులు వెళ్లిపోవడాన్ని గ్రామస్థులు తప్పుబట్టారు. దీనిపై ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



నెల్లూరు : ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు



గాంధీబొమ్మ వద్ద మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు

కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన

- ప్రజల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం
- అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు
- రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ
- జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీ
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి
- నెల్లూరులో 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో భారీ ర్యాలీ
- పాల్గొన్న ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు

నెల్లూరు (విద్య), జూన్ 15 : రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన జరుగుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలుకుతూ ప్రజలంతా తమ ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఐదు సంతకాలు చేశారన్నారు. అంతేగాక ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నిటికీ శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మున్ముందు ప్రజా పరిపాలన ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసి రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి 164 ఎమ్మెల్యే సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఓ ఎంపీ, పదిమంది ఎమ్మెల్యేల విజయంతో చారిత్రాత్మిక తీర్పు ఇచ్చిన ప్రజల రుణం తీసుకునే సమయం ఆసన్నమైందన్నారు. వైనాట్ 175 అని 2019లో వచ్చిన సీట్లలో మధ్యలో ఐదు పోగొట్టుకున్నారని జగన్‌కు తగినశాస్తి జరిగిందన్నారు. చంద్రబాబుకు అండగా నిలిచి పవన్ కల్యాణ్ నిజమైన హీరో అనిపించుకున్నారన్నారు. మాజీ కాకాణి ఇరిగేషన్‌లో పనులు చేయకుండానే కోట్ల రూపాయలను దిగమింగారని ఆరోపించారు. జిల్లాలో జరిగిన భూ కుంభకోణం, మైనింగ్‌దోపిడీ, జగనన్న కాలనీల పేరుతో అక్రమాలు, ఇరిగేషన్‌లో జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలను వెలికితీస్తామన్నారు. మంత్రి నారాయణ ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, త్వరలోనే ఈ అవినీతి, అక్రమాలను బట్టబయలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించి ర్యాలీగా గాంధీబొమ్మ వరకు చేరుకున్నారు. అక్కడ గాంధీజీకి పాలభిషేకం చేసి, బాణాసంచాతో సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశిం సునీల్‌కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకుందాం

- మత పెద్దలతో ఎస్పీ సమన్వయ సమావేశం

నెల్లూరు (క్రైం), జూన్ 15 : ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు జరుపుకోవాలని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. శనివారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం బక్రీదు పండుగ సందర్భంగా హిందూ, ముస్లిం మతపెద్దలతో ఎస్పీ సమావేశమై మాట్లాడారు. మతసామరస్యాన్ని కాపాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద పోలీస్ పికెట్‌తోపాటు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత సామరస్యానికి భంగం కలిగించేలా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా 112కు సమాచారాన్ని అందించాలని కోరారు. అనంతరం ఇరు మతపెద్దలు ఒకరినొకరు సహకరించుకుంటామని ఎస్పీకి హామీ ఇచ్చారు.



మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

అక్రమ లేఅవుట్లపై సర్వే

- ప్రభుత్వ స్థలాల గుర్తింపు
- ఎక్స్‌కవేటర్‌తో ట్రంచ్ ఏర్పాటు
- రియల్టర్ల గుండెల్లో రైళ్లు
- ఆందోళనలో కొనుగోలు దారులు



తుమ్మలపెంట రోడ్డులో గుంట చుట్టూ ట్రంచ్ కొట్టిస్తున్న అధికారులు



వెంగాయగారిపాలెం రోడ్డులో చెన్న కేశవులనాయుడు లేఅవుట్‌లో తవ్విన ఆక్రమణకు గురైన పంటకాలువ

కావలి, జూన్15: పట్టణంలోని పంటకాలువలు, గుంటలు, రోడ్లు, శ్మశానాలు ఆక్రమించి వేసిన లేఅవుట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు.ఆర్డీవో శీనానాయక్ ఆదేశాల మేరకు అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్రభుత్వ స్థలాలను వెలికి తీసేందుకు శనివారం అధికారుల బృందం సర్వే ప్రారంభించింది. మున్సిపల్ పట్టణ ప్రణాళి కాధికారి బాబూరావు, కావలి ఆర్ఐ శివకుమార్, కావలి, బోగోలు మండల సర్వేయర్లు, కావలికి చెందిన వీఆర్వోలు చందు, బాలయ్య, పలువురు సచివాలయ సిబ్బందితో ఏర్పడిన బృందం శనివారం మధ్యాహ్నం నుంచి అక్రమ లేఅవుట్లలో సర్వే ప్రారంభించింది. తొలుత వెంగాయగారిపాలెం రోడ్డులో ఉన్న అక్రమలేఅవుట్లలో సర్వే చేపట్టి లేఅవుట్‌లో పంటకాలువలుగా ఉన్న ప్రభుత్వ స్థలాలు గుర్తించి మార్కింగ్ చేశారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో మార్కింగ్ చేసిన స్థలంలో ట్రంచ్ నిర్మాణం చేపట్టారు. అలాగే తుమ్మలపెంట రోడ్డులో ఆక్రమణకు గురైన 2.73 ఎకరాల ప్రభుత్వ నీటి గుంటను సర్వే చేసి దాని చుట్టూ ట్రంచ్ ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉన్న అక్రమ లేఅవుట్లు అన్నింటిని దశలవారీగా సర్వేచేసి అందులో ఉన్న ప్రభుత్వ స్థలాలను కాపాడాలనే ఆలోచనతో అధికారులు ముందుకు పోతున్నారు. దీంతో రియల్టర్ల గుండెల్లో రైళ్ల పరిగెడుతుండగా, ప్లాట్ల కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో పర్సు చోరీ

కావలి రూరల్,జూన్15: కావలి రైల్వేస్టేషన్‌లో శనివారం సాయంత్రం పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న ప్రయాణికురాలు గంటా వరమ్మ బ్యాగులో ఉన్న పర్సును ఇద్దరు మహిళలు అపహరించారు. చేవూరి తోటకు చెందిన వరమ్మ 20 మందితో కలిసి కాశీకి వెళ్లేందుకు పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఆసమయంలో ఒడిసాకు చెందిన ఇద్దరు మహిళలు కూడా రైలు ఎక్కుతున్నట్లు నటిస్తూ ఆ పర్సును లాగేశారు. అందులో రూ.10 వేలు నగదు ఉంది. వారిని ఎక్కించటానికి వచ్చిన వారి బంధువులు మనోహర్ మరికొంత మంది పర్సు లాగటం గుర్తించి వారిని పట్టుకుని కావలి జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ అరుణకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అనంతసాగరం, జూన్ 15: మండలంలోని మంగుపల్లికి చెందిన యాకశిరి పెంచలయ్య (47) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. స్వగ్రామం నుంచి సమీపంలోని చేపల చెరువు వద్దకు ద్విచక్ర వాహనంలో ఈనెల 9వ తేదీన వెళ్తుండగా బద్వేలు వైపు వెళ్లే మరో మోటారు బైక్ ఢీకొనడంతో పెంచలయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమశిల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనింగ్ అక్రమాలపై అధికారుల కొరడా

- వైసీపీ జడ్పీటీసీకి చెందిన మైనింగ్ యార్డ్ సీజ్



చేజర్ల వైసీపీ జడ్పీటీసీ పీర్ల పార్థసారధికి చెందిన మైనింగ్‌యార్డ్‌లో అక్రమంగా నిల్వఉంచిన తెల్లరాయి

చేజర్ల, జూన్15: మండలంలో గత కొన్ని రోజులుగా యథేచ్ఛగా నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌కు శనివారం అధికారులు అడ్డుకట్ట వేశారు. మండలంలో ఆక్రమంగా తెల్లరాయి తవ్వుతున్న పొలాలపై మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేజర్ల తహసీల్దార్ కే.గోపికృష్ణ, ఎస్ఐ ప్రభాకర్ దాడులు నిర్వహించి, చేజర్ల వైసీపీ జడ్పీటీసీ పీర్ల పార్థసారధికి చెందిన మైనింగ్ యార్డ్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ మాట్లాడుతూ మండలంలో అక్రమంగా మైనింగ్ జరుగుతున్నట్లు అందని ఫిర్యాదు మేరకు తనిఖీలు చేస్తుండగా ఆదురుపల్లి సమీపంలో సర్వే నెం557లో అక్రమంగా తెల్లరాయి తవ్వుతున్న వాహనాన్ని సీజ్ చేసి, చేజర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇక్కడ తవ్వుతున్న తెల్లరాయిని ఎటువంటి అనుమతులు లేకుండా సమీపంలో సర్వేనెం 578,579లో ఉన్న శ్రీరామ్ మినరల్స్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆ యార్డ్‌లో అక్రమంగా ఉన్న 1560 టన్నుల తెల్లరాయి సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేసినట్లు తెలిపారు. యార్డ్ యజమాని పీర్ల పార్థసారధిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ దేవిసింగ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

- మృతుడు బుచ్చిరెడ్డిపాళెం నివాసి



మృతుడు షేక్ ఖాజామస్తాన్

మనుబోలు, జూన్ 15: అప్పుల బాధ తట్టుకోలేక వైద్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న షేక్ ఖాజా మస్తాన్ (40) స్థానిక కండలేరు వాగులో దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం వాగులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం, బుచ్చిరెడ్డి పాళెం ఖాజానగర్‌కు చెందిన ఖాజా మస్తాన్ మూడు సంవత్సరాలుగా వెంకటేశ్వరపురం, జనార్ధన్‌రెడ్డి కాలనీ సెంటర్‌లో ఉన్న నగర ప్రాథమిక వైద్య కేంద్రంలో గ్రేడ్-2 కాంట్రాక్టు ఫార్మాసిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. క్రెడిట్ కార్డుల ద్వారా ఎక్కువగా లక్షల్లో రుణాలు తీసుకుని, చెల్లించలేక అప్పుల పాలయ్యాడు. రెండునెలల క్రితం ఖాజా కుటుంబ సభ్యులు కొంతమేర అప్పులు తీర్చేందుకు డబ్బులు కట్టారు. మిగిలిన అప్పులు చెల్లించాలని క్రెడిట్ కార్డు కంపెనీలు ఇబ్బందులు పెడుతుండడంతో మానసిక వేదనకు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు పూనుకున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఖాజా తల్లితో ఫోన్‌లో మాట్లాడి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. మోటార్‌సైకిల్‌పై మనుబోలు కండలేరు వాగుకు చేరుకున్నాడు. చెప్పులు, చొక్కా, హెడ్‌ఫోన్స్, సెల్‌ఫోన్ పక్కనపెట్టి, కూల్‌డ్రింక్‌లో నిద్రమాత్రలు కలుపుకుని తాగి వాగులోకి దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అజయ్‌కుమార్ వాగువద్దకు చేరుకుని గజ ఈతగాళ్ళ సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	157
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	276
స్కిన్‌లెస్	306
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6864
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 93.30

సోమశిలకు 1,676 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 15: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 1,676 క్యూసెక్కుల ప్రవాహం వస్తు న్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎం సీలు కాగా, 8.341 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని విడు దల చేస్తున్నారు.

కాలువ పనుల్లో దోపిడీ

ఇది కనుపూరు చెరువు కింద ఉన్న ఓ షట్టర్. దీన్ని బాగుచేయాలని చాలాకాలం నుంచి అడుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, కానీ పనులు చేయకుండానే బిల్లులు తినేశారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.



- కనుపూరు కెనాల్ పేరుతో భారీగా పనుల మంజూరు
- వర్క్ చేయకుండానే బిల్లుల డ్రా
- ఒకే పనికి ఎఫ్‌డీఆర్, ఓఅండ్‌ఎంలో బిల్లులు
- సర్వేపల్లిలోని వారికి మాత్రమే అవకాశం
- గత ప్రభుత్వంలో శృతిమించిన అధికారుల తీరు
- ఇరిగేషన్ శాఖపై నేడు కొత్త ఎమ్మెల్యేల కళ్లు

నెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలవాల్సిన ఇరిగేషన్‌శాఖ గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు కల్పతరువుగా మారింది. ఈశాఖ ఉన్నది రైతుల ప్రయోజనాల కోసం కాదు.. తమ దోపిడీ కోసం.. అన్నట్లుగా సాగింది. అందులోనూ నెల్లూరు సెంట్రల్ డివిజన్ గురించి అయితే ప్రత్యేకంగా చెప్పు కోవాలి. డెల్టా ప్రాంతం మొత్తం దాదాపుగా ఈ డివిజన్ కిందనే ఉంది. ఇంకేముంది.. ఆయా నియోజకవర్గాల్లో ఎవరి స్థాయిలో వారు విచ్చలవిడి దోపిడీకి పాల్పడ్డారు. కొందరు అధికారులు వీరికి జతకట్టి వారు కూడా భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారు. వైసీపీ నేతలు చెప్పినవే రూల్స్‌గా పాటిస్తూ అక్రమాలకు సహకరిం చారు. అందులోనూ కనుపూరు కాలువ సబ్ డివిజన్‌లో అయితే అక్రమాలు తార స్థాయికి చేరాయన్న ఆరోపణలు మొదటి నుంచి వినిపిస్తున్నాయి. పనులు చేయకుండానే చేసినట్లుగా చూపించి రూ.కోట్ల బిల్లులు తినేసినట్లు ఆరోపణలున్నాయి. అసలు ఏయే పనులు కనుపూరు కాలువ కింద చేశారో.. ఆ వివరాలను ఇవ్వాలంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్వయంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా ఇరిగేషన్ అధికారులు ఇవ్వలేదంటే అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

పొదలకూరు, నెల్లూరు రూరల్, వెంకటాచలం, మనుబోలు మండలాల పరిధిలో సర్వేపల్లి కాలువ విస్తరించి ఉంది. ఎక్కువగా సర్వేపల్లి నియోజకవర్గంలో కనుపూరు కాలువ ఆయకట్టు ఉంది. ఇక్కడ పనుల్లోనే కాకుండా చెరువుల్లో మట్టి తవ్వకాల్లో కూడా భారీ అవినీతే జరిగింది. వెంకటాచలం వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కనుపూరు కాలువను వైసీపీ ప్రభుత్వంలో కుళ్ల బొడిచారు. అనుమతులు లేకుండా సుమారు రూ.30 కోట్ల విలువైన మట్టి, గ్రావెల్‌ను తవ్వి తరలించినట్లు అంచనా. ఇప్పటికీ ఆ చెరువులో భారీ గుంతలు కనిపిస్తుండడమే ఈ దోపిడీకి నిదర్శనం. అప్పట్లో టీడీపీ నేతలు ఈ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి ఆందోళనలు చేసినా సెంట్రల్ డివిజన్ అధికారులు కనీసం అటు వైపు కూడా చూడకపోవడం గమనార్హం.

పనులు చేయకనే బిల్లుల డ్రా ?

కనుపూరు కాలువను టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకం కింద ఆధునీకీకరించారు. పూర్తిగా పూడిక తీశారు. అయితే ఆ తర్వాత జగన్ ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలు మళ్లీ అవే పనులు మంజూరు చేయించుకున్నారు. ఈ పనులు చేయకుండానే బిల్లులు తినేసినట్లు ఆరోపణలు న్నాయి. అంతేకాకుండా ఒకే పనికి అటు ఎఫ్‌డీఆర్, ఇటు ఓఅండ్‌ఎం కింద మంజూరు చేయించారు. ఇలాంటి చాలానే ఉన్నాయి. ఉదాహరణకు.. కనుపూరు చెరువులోని ఓ స్లూయిజ్ షట్టర్ పనులు సుమారు రూ.10 లక్షలతో ఓఅండ్‌ఎం కింద చేయగా, అదే పనులు అంతకముందు ఏడాది ఎఫ్‌డీఆర్ కింద చేసినట్లు బిల్లులు పెట్టారు. అయితే వాస్తవానికి అసలు ఆ స్లూయిజ్ షట్టర్ పనులు చేయలేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఎఫ్‌డీఆర్ ముసుగులో రెండేళ్లపాటు భారీ దోపిడీ జరిగింది. విచ్చలవిడిగా కలెక్టర్ నుంచి అనుమతులు ఇప్పించారు. వాటిలో చాలా వరకూ పనులే చేయలేదని అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంతో ఆ మరుసటి ఏడాది ఒక్క రూపా యి కూడా ఎఫ్‌డీఆర్ పనులు మంజూరు చేయలేదు. ఇక గతేడాది అనుమతులు ఇచ్చిన ఎఫ్‌డీఆర్ పనులకు సంబంధించి ప్రతి దశ పని ఫొటోను తనకు చూపించాలని ప్రస్తుత కలెక్టర్ ఆదేశించారంటే గతంలో దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుంది. ఇక గతేడాది జూలైలో కనుపూరు కాలువ కింద 79 పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి ఓఅండ్‌ఎం కింద అనుమతులు తెచ్చారు. వీటిలో రెండు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉండగా, నాలుగు ప్యాకేజీలు సర్వేపల్లిలో ఉన్నాయి. రూరల్ నియోజకవర్గంలోని రెండు పనులకు పిలిచిన టెండర్లలో కాంట్రాక్టర్లు పోటీ పడగా, సుమారు 30 శాతం లెస్‌కు వెళ్లాయి. కానీ సర్వేపల్లిలో పిలిచిన నాలుగు ప్యాకేజీలకు టెండర్లు వేయకుండా కాంట్రాక్టర్లను నిలువరిం చడంతో ఇక్కడ పోటీలేకుండా ఎక్సెస్‌కు వెళ్లాయి. నిబంధ నల ప్రకారం ఈ పనులకు లయబుల్ పీరియడ్ రెండు సంవత్సరాలు పెట్టాల్సి ఉండగా, ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో అధికారులు ఆరు నెలలకు తగ్గించినట్లు సమాచారం.

ఫైళ్లు బయటకు రాకుండా తాళాలు

తాజాగా జిల్లాలో ఏ శాఖలో లేని విధంగా సెంట్రల్ ఇరిగేషన్ డివిజన్‌లోని ఫైళ్లు బయటకు వెళ్లకుండా తాళాలు వేశారంటే ఇప్పటివరకూ జరిగిన ప్రచారాలకు బలం చేకూరుతోంది. గతంలో మంజూరైన పనులు చేయకుండానే ఇప్పుడు పాత తేదీలతో బిల్లులు రికార్డు చేసే పనిలో కొందరు అధికారులు ఉన్నారని, మరికొందరు గతంలో అనుమతులిచ్చిన ప్రొసీడింగ్స్‌ను మాయం చేయాలని ప్రయత్నిస్తున్నారని తాజాగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేలకు సమాచారం అందడంతో వారు ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ఆ క్రమంలోనే శనివారం కలెక్టర్ ఆదేశాలతో డీఆర్వో సెంట్రల్ డివిజన్‌లో తనిఖీలు చేసినట్లు చెప్పుకుంటున్నారు.

ఆ ముగ్గురిదే హవా

కనుపూరు కాలువ కింద గత ఐదేళ్లలో పనులు చేసిన కాంట్రాక్టర్ల వివరాలను చూస్తేనే అక్కడ దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో స్పష్టమవుతుంది. గతంలో టెండర్లు పిలిస్తే పదుల సంఖ్యలో కాంట్రాక్టర్లు పోటీ పడేవారు. కానీ వైసీపీ ప్రభు త్వంలో మాత్రం కొందరు కాంట్రాక్టర్ల పేరు మీదనే వర్కు లన్నీ అగ్రిమెంట్లు జరిగాయి. ఆ కాంట్రాక్టు సంస్థలన్నీ వైసీపీ నేతల బినామీలవన్న ఆరోపణలున్నాయి. సర్వేపల్లిలో జరిగిన వర్కుల్లో చాలా వరకు అప్పటి ఓ ప్రజాప్రతినిధి వద్ద ఆర్థిక లావాదేవీలు చూస్తున్న వ్యక్తి పేరు మీద చేసి నట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తితోపాటు మరో రెండు సంస్థలే కనుపూరు కాలువ కింద ఎక్కువగా పనులు చేసినట్లు సమాచారం. ఈ దోపిడీకి కనుపూరు కాలువ సబ్ డివిజన్‌లో పనిచేసిన ఓ డీఈ, ఇద్దరు ఏఈఈలు పూర్తిగా సహక రించినట్లు ఆరోపణలున్నాయి. వచ్చిందే అవకాశంగా ఈ ముగ్గురు కూడా వైసీపీ నేతలతో కలిసి భారీగా ప్రజాధనాన్ని దోచుకున్నట్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ సబ్‌డివిజన్‌కు మరో అధికారిని రానీయకుండా వారు గుత్తాధిపత్యం వహించినట్లు ఇరిగేషన్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఆక్రమణదారుల వివరాలు సేకరణ

చేజర్ల, జూన్15:: మండలంలోని ఆదురుపల్లిలో అటవీశాఖకు చెందిన భూముల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు.ఈ నేపథ్యంలో వారి వివరాలను శనివారం అటవీశాఖ అధికారులు సేకరించారు. ఇటీవల అక్రమణలు ఎక్కువైన క్రమంలో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఫారెస్టు డీఆర్‌వో రసూల్ తెలిపారు. అదే విధంగా తమ హద్దు వరకు గుర్తులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా ఆక్రమణలకు దిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ అధికారులు, స్థానిక అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అటవీ శాఖ అధికారులు



కలెక్టర్, ఎస్పీలతో చర్చిస్తున్న మంత్రి నారాయణ


ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తాం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు(వైద్యం), జూన్ 15 : ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తా నని రాష్ట్ర మున్సిపల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని తన నివాసంలో జరిగిన పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో పెద్ద బాధ్యతను అప్పగించారన్నారు. రాష్ట్రంలోని 114 మున్సిపాలిటీలలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. గతంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చామని చెప్పారు. నిరుపేదలకు 11 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. అమరావతి రాజధాని కోసం 2015 జనవరి 1వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చామని ఫిబ్రవరి 28వ తేదీన రైతులు 34వేల ఎకరాలు ఇచ్చారన్నారు. అందులో రూ.9వేల కోట్లు ఖర్చుపెట్టి 90 శాతం నిర్మాణాలు పూర్తి చేశామని పేర్కొన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాజధాని అమరావతి నిర్మాణమే టీడీపీ ప్రభుత్వం లక్ష్యమని, రాను న్న రెండున్నరేళ్లల్లో ప్రపంచంలో టాప్ 5లో అమరావతి రాజధాని ఉండాలన్న లక్ష్యంతో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లు నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారితో మంత్రి పలు విషయాలపై చర్చించారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తహసీల్దారు కార్యాలయ స్థలానికే ఎసరు

- రాత్రికి రాత్రే ఆక్రమణ.. స్థలం చదును
- విడవలూరులో ఓ ఫీల్డు అసిస్టెంటు, మరొకరిపై ఆరోపణలు
- జెండాలు పాతి చేతులు దులుపుకున్న అధికారులు



తహసీల్దారు కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో దుక్కి దున్నిన కబ్జాదారులు

నెల్లూరు: నాయకులు, అధికారులు తన వెంటే ఉన్నారన్న గర్వం... ఎవరేం చేస్తారన్న ధీమాతో ఓ అక్రమార్కుడు సాక్షాత్తు తహసీల్దారు కార్యాలయానికి చెందిన స్థలాన్నే కబ్జా చేసేందుకు ప్రయత్నిం చాడు. రాత్రికి రాత్రే స్థలాన్ని చదును చేయించేశాడు. శనివారం ఇది వెలుగులోకి రావడంతో సదరు స్థలం చుట్టూ కేవలం జెండాలు పాతి అధికారులు చేతులు దులుపుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మరొకరిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దారు కార్యాలయానికి సుమారు 3ఎకరాల స్థలం ఉండగా, ప్రహరీ లేకపోవటంతో కొందరు వ్యక్తుల కన్ను ఆ విలువైన స్థలంపై పడింది. పోలీసుస్టేషన్ వెనుక ఉన్న అరెకరా స్థలాన్ని రాత్రిరాత్రే ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. ఆక్రమిత స్థలం చుట్టూ రాళ్లు నాటి, నాట్లు వేయడానికి అనుకూలంగా నీరు పెట్టారు. ఈ ఆక్రమణ వ్యవహారం శనివారం వెలుగులోకి రావడంతో స్థానికులు నివ్వెరపోయారు. సాక్షాత్తు రెవెన్యూ కార్యాలయం సమీపంలోనే స్థలం కబ్జా చేస్తే అధికారులు ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు.

ఇద్దరిపై ఆరోపణలు

సోషల్ మీడియాలో విలేకరిగా పని చేస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, తన మిత్రుడితో కలిసి స్థలం కబ్జా చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికార పార్టీ నేతలు తాను చెప్పినట్లు వింటారని, కబ్జా చేసినా అధికారులు పట్టించుకోరనే ధీమాతో ఆక్రమించినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, అక్రమణ వ్యవహారం బయటకు రావడంతో అధికారులు స్థలం చుట్టూ ఎర్ర జెండాలు పాతి చేతులు దులుపుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

జొన్నవాడ ఆలయం హుండీల లెక్కింపు



జొన్నవాడ ఆలయంలో హుండీలు లెక్కిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 15: మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి, దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. గత నెల 27 నుంచి శనివారం వరకు మొత్తం 21 రోజులకు గాను రూ. 13,65,038 వచ్చింది. అన్నదానం హుండీల ద్వారా రూ. 1,59,517,63 గ్రాముల బంగారు వస్తువులు, 303.800 గ్రాముల వెండి వస్తువులు భక్తులు సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి వి గిరికృష్ణ తెలిపారు. హుండీల లెక్కింపులో జిల్లా ఏసీ జంజనం శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్, ఆశాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ఏపీజీ బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్

ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), జూన్ 15 : ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం కేఏసీ కళాశాలలో అధ్యాపకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఆన్‌స్క్రీన్ వాల్యుయేషన్‌లో జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు పాల్గొనాలన్నారు. వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొనే లెక్చరర్స్ సంఖ్య పెంచేందుకు సంబంధిత సబ్జెక్టుల నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి లెక్చరర్లకు దిశానిర్దేశం చేస్తూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు. కళాశాలల యాజమాన్యాలకు కూడా దీనిపై అవగాహన కల్పించేలా అన్ని ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల యాజమాన్యాలు వెంటనే తమ లెక్చరర్‌లు స్పాట్‌లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్‌బోర్డు ఆదేశాలను తప్పక పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు విద్యాసంస్థల బస్సులు సీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్ పేట), జూన్ 15: విద్యాసంస్థల బస్సులకు ఎఫ్‌సీ కాల పరిమితి ముగిసినా నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను ఎక్కించుకొని రోడ్లపై తిరుగుతున్న మూడు విద్యాసంస్థలకు చెందిన బస్సులను రవాణాశాఖ అధికారులు శనివారం సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో పొదలకూరు వద్ద బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు విద్యాసంస్థల బస్సులు తనిఖీలు చేస్తుండగా ఈ ఏడాది మే నెల 15వ తేదీతో ఎఫ్‌సీ గడువు ముగిసిన మూడు బస్సులను గుర్తించారు. దీంతో ఆ బస్సులను సీజ్ చేశారు.

నేటి నుంచి అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాలమ్మ అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూన్ 15: మండలంలోని గన్నేపల్లి పంచాయతీ లో ఉన్న శ్రీ అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆదివారం గడ్డంవారిపల్లి నుంచి నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, గన్నేపల్లి, మంగళవారం మిట్టపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, పేరంటాలమ్మ నగర్‌లో గ్రామోత్సవం జరుగుతుంది. బుధవారం పసుపుకుంకుమ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం పొంగళ్లు, బండలాగుడు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గంగాభవాని తిరునాళ్ల...



సీతారామపురం, జూన్ 15 : మండలంలోని సింగారెడ్డిపల్లిలోని గంగాభవానీ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాలను ఆదివారం నుంచి మూడురోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి యాదవ సంఘ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం సాయంత్రం నిలుపు, విశేష పూజా కార్యక్రమాలు, సోమవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు ఉత్సవం, మంగళవారం సాయంత్రం బండ్ల పొంగళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి సంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూన్ 15: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో స్వయంభుగా వెలసిన సంతానలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17న గణపతి పూజ, పుణ్య హవచనం, గోపూజ, అమ్మవారి పంచామృతాభిషేకాలు, నవగ్రహ హోమాలు, కుంకుమార్చనలు, హారతి, పుట్ట మన్ను తెచ్చుట, 18న అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ, హోమాలు, 19న పసుపు, కుంకుమ ప్రదానోత్సవం, సంతానంలేని వారు వరపడుట, అమ్మవారి గ్రామోత్సవం, 20న ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం, 21న అభిషేకాలు, ధనలక్ష్మి అలంకరణ, బండ్లపొంగళ్ల కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు భక్తులకు అన్నదాన సౌకర్యం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాలొనాలని నిర్వాహకులు కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

సీతారామపురం, జూన్ 15 : ఉపాధి హామీ పథకం కింద సీతారామపురం గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులను ఏపీఓ సుభాషిణి శనివారం పరిశీలించారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి పూర్తిస్థాయి వేతనం పొందాలని, ఉదయం 6గంటల నుంచి 10 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు.

అంగన్‌వాడీల బడిబాట ర్యాలీ

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 15: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని శనివారం మండలంలోని నందిపాడు, రెడ్లదిన్నె, బొటికర్లపాడు, శ్రీరాంనగర్ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భోగ్యం సరస్వతి, జయమ్మ, ప్రమీల, అన్నపూర్ణ, విజయ, సుభాషిని, ప్రభావతి, చిన్నక్క, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం నిధులకు ప్రతిపాదనలు

ఉదయగిరి, జూన్ 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలో 16వ ఆర్థిక సంఘం నిధుల అంచనాలకు ప్రతిపాదనలు రూపొందించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఈవోపీఆర్డీ మల్లికార్జున అంచనాలకు ప్రతిపాదనలు తయారు చేశారు. 15వ ఆర్థిక సంఘ నిధుల్లో మంజూరైన నిధులు, వాటి ఖర్చులు తదితర అంశాలను అంచనాలు వేస్తూ 16వ ఆర్థిక సంఘం నిధుల విడుదల అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై అన్నదాతల హర్షం

ఉదయగిరి రూరల్, జూన్ 15: ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతకాలు చేశారు. రాక్షస చట్టంగా ఉన్న ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయడంతో అన్నదాతలు, తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేయడం హర్షణీయమని, గత ప్రభుత్వ పాలనలో ఈ చట్టం రద్దు చేయాలని న్యాయవాదులు చేసిన పోరాటాలకు ఫలితం దక్కిందని టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు అన్నారు. ఈ చట్టం రద్దు పట్ల రైతులు గడ్డం వెంకటేశ్వర్లు, ఈర్ల శంకర్, సుబ్బారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు పెద్దల పండుగ
- రేపు సామూహిక ప్రార్థనలు
- ఏర్పాట్లలో ముస్లింల నిమగ్నం


తోటలచెరువుపల్లిలో ముస్తాబైన ఈద్గా

వరికుంటపాడు, జూన్ 15: ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పండుగను సోమవారం నిర్వహించుకునేందుకు ముస్లింలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మసీదులతో పాటు సామూహిక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈద్గాలను ముస్తాబు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు: తొలిరోజైన ఆదివారం ఇంటిల్లిపాది పెద్దల పండుగను నిర్వహించి మృతి చెందిన కుటుంబీకులకు నూతన వస్త్రాలు, వంటకాలతో నైవేద్యాలు పెట్టి ప్రార్థనలు చేపడతారు. అలాగే రాత్రి సమయంలో జాగారణ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లోను అవసరమైన వసతులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థనలు చేసే ఈద్గాల వద్ద ప్రత్యేక వసతులను సైతం ఏర్పాటుచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉన్నవారు స్వగ్రామాలకు చేరుకోవడంతో ప్రతి కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది.

పని చేయని వీడియో కాన్ఫరెన్స్ టీవీలు

- అధికారుల అవస్థలు


ఎంపీడీవో కార్యాలయంలో పనిచేయక నిరుపయోగంగా ఉన్న టీవీ

ఉదయగిరి, జూన్ 15: నియోజక వర్గ కేంద్రమైన ఉదయగిరి తహసీల్దారు, మండల పరిషత్ కార్యాల యాల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయకపోవడంతో అధికారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి సోమవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుంది. అలాగే మండల పరిషత్ కార్యాల యంలో మిగిలిన రోజుల్లో అత్యవసర వీడియో కాన్ఫరెన్స్‌లకు అవకాశం కల్పిస్తారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ రెండు కార్యాలయా ల్లో వీడియో కాన్ఫరెన్స్ టీవీలు పనిచేయక సంబంధిత అధికారులు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుత్తలూరుకు పరుగులు తీయాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వీడియో కాన్ఫరెన్స్ టీవీలు పనిచేసేలా చూడాలని అధికారులు కోరుతున్నారు.

వైభవంగా నాగూరమీరా గంధోత్సవం


గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంగం, జూన్ 15: మండలంలోని వెంగారెడ్డిపాళెంలో శనివారం తెల్లవారుజామున నాగూర మీరా గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ గ్రామంలో పది కుటుంబాలు మాత్రమే ముస్లింలు. మిగిలిన కుటుంబాలన్నీ హిందూవులవే. సాయిబాబా ఆలయం, నాగూరమీరా దర్గా ఒకే ఆవరణంలో ఉంటాయి. కాంపౌండ్ కూడ ఒక్కటే. గంధ మహోత్సవంలో ముస్లింల కంటే హిందూవులే ఎక్కువగా పాల్గొనడం గమనార్హం. సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఏటా గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

పెంచలకోనకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

అనంత సాగరం, జూన్ 15: మండల టీడీపీ అధ్యక్షురాలు మునగ పాటి సునీత ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తలు చిలకల మర్రి నుంచి పాదయాత్రగా రాపూరు మండలం పెంచల కోనకు వెళ్లారు. అక్కడ శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకు న్నారు. టీడీపీ అధికారంలోకి రావడం, ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ఎన్నిక కావడంతో తన మొక్కు తీర్చుకొన్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసలురెడ్డి, కిరణ్ పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి మాతమ్మ జాతర


సంగం, జూన్ 15: స్థానిక తూర్పు దళితవాడలోని మాతమ్మ ఆలయంలో ఆదివారం నుంచి జాతర ప్రారంభం కానున్నది. ఈ జాతర ఐదు రోజులపాటు జరగనున్నది. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు కలశస్థాపనతో జాతర ప్రారంభమవుతుంది. ప్రతి రోజు అమ్మవారికి అభిషేకాలు, పూలంగిసేవ, ప్రత్యేక ముత్యాల, చందన అలంకరణ, అన్నదానం జరుగుతాయి. చివరి రోజు పొంగళ్లు, ఎడ్లబండ్ల ఉత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు వైష్ణవి ఎంపిక

ఏఎస్ పేట,జూన్15: ఎన్ఎంఎంఎస్ జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు జమ్మవరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి ఎంపిక అయినట్లు హెచ్ఎం హరిప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన శనివారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు 9 నుంచి 12వ తరగతి వరకు ప్రతి ఏటా రూ. 12వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.దీంతో ఆ విద్యార్థినిని ఎంఈవో జ్యోతి, ఎంఈవో-2 సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

కలగా మిగిలిన పేదవాడి సొంతింటి కల

- లబ్ధి పొందింది వైసీపీ నేతలే..!


ఉదయగిరి మండలం కొండాయపాళెం జగనన్న లేఅవుట్‌లో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం


దుత్తలూరు మండలం వెంకటంపేటలో బేస్‌మట్టాలకే పరిమితమైన జగనన్న ఇళ్లు

ఉదయగిరి రూరల్, జూన్ 15: ప్రతి పేదవాడికి ఉచిత స్థలంతో పాటు నాణ్యమైన ఇల్లు నిర్మించి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చి ఐదేళ్లు అధికారంలో ఉండి చివరకు పేదల కలను నెరవేర్చలేకపోయారు. ప్రస్తుతం జగనన్న లేఅవుట్లలో కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తి ఇళ్లు, నాసిరకం బేస్‌మట్టాలు దర్శనమిస్తుండగా, మరికొన్ని ప్రాంతాలు చిట్టడవిని తలపిస్తున్నాయి. కాలనీలకు సేకరించిన స్థలాలు కొండలపై, శ్మశానాలు, చెరువుల పక్కన, లోతట్టు ప్రాంతాల్లో ఇచ్చారు. నివాసయోగ్యమైన స్థలాలు లేకపోవడంతో పలువురు వెనుకంజ వేయగా, మరికొంత మంది ముందుకొచ్చి అష్టకష్టాలు పడి బేస్‌మట్టాలు నిర్మించగా, మరికొంతమంది అరకొరగా ఇళ్లు నిర్మించారు. కొన్ని పంచాయతీల్లో ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోవడంతో ప్రస్తుతం జగనన్న లేఅవుట్లు చిట్టడవిని తలపిస్తున్నాయి.

ప్రజాధనం దోచుకున్న వైసీపీ నేతలు

లేఅవుట్ల అభివృద్ధి పేరుతో జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి బోర్ల ఏర్పాట్లతోపాటు మొక్కల పెంపకం చేపడుతున్నట్లు భారీగా నిధులను ఖర్చు చేసింది. ఇళ్లు నిర్మించకపోయినా అభివృద్ధి పేరుతో వైసీపీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో స్థలం దొరక్క ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి రూ.లక్షలు స్వాహా చేసి తమ జేబులు నింపుకున్నారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో అర్హులైన వారికి ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదనే పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ పరిస్థితి ఏమిటని అరకొరగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

భక్తులకు మెరుగైన వసతులు : ఎమ్మెల్యే ఇంటూరి


వలేటివారిపాలెం : నృసింహస్వామి గర్భగుడిలో ఇంటూరి కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వలేటివారిపాలెం, జూన్ 15: మాలకొండకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామిని శనివారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గోశాలను సందర్శించి గోమాతకు పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురైతే సహించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఎలక్ట్రికల్ ఆటోలో ఎక్కి తిరిగారు. తదనంతరం ఆలయంలో జరుగుతున్న అబివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డీసీ కేబీ శ్రీనివాసరావు, వలేటివారిపాలెం, గుడ్లూరు, కందుకూరు మండలాల టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు, దామా మల్లేశ్వరరావు, నాయకులు చెరుకూరి వంశీకృష్ణ, కామినేని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

- **మాలకొండను దర్శించుకున్న ఎమ్మెల్యేలు**

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యలు వేర్వేరుగా దర్శించుకున్నారు. వాళ్లకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా వారు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేలకు అర్చకులు శాలువా పూలమాలతో సత్కరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయంలో భక్తులకు అనుగుణంగా అబివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని ఆలయ అధికారులను ఎమ్మెల్యేలిద్దరూ అభినందించారు.

- **మాలకొండకు పాదయాత్ర**

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని ఎర్రారెడ్డిపాలెం టీడీపీ నాయకులు శనివారం మాలకొండకు పాదయాత్ర చేశారు.ఉదయం 7 గంటలకు గ్రామంలోని రాములోరి ఆలయం, నాగార్పమ్మ గుడిలోనూ ప్రత్యేక పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఉట్లపల్లి పెద్ద మాధవరావు, పార్టీ నాయకులు రాజారపు మాలకొండయ్యల ఆధ్వర్యంలో నాయకులు, తెలుగు యువత నేతలు పాదయాత్రగా మాలకొండకు చేరుకున్నారు.మాలకొండలో 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి


సాంఘిక సంక్షేమశాఖామంత్రి స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ సెల్ నాయకులు

కందుకూరు, జూన్ 15: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తొలిసారిగా నియోజకవర్గంలో శనివారం అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికలకు విద్యాకిట్లు పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేశారని, నారా లోకేష్ విద్యాశాఖామంత్రిగా ఉన్నందున విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తారని తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఎమ్మెల్యే ఇంటూరిని ఘనంగా సత్కరించారు. ఎంఈవో సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడారు. బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ద్వారాకారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ప్రసాదరావు, ఎంఈవో సుబ్బారెడ్డి, హెచ్ఎంలు నరసింహమూర్తి, మాల్యాద్రి, షౌకత్‌అలీ, కమలకుమార్, దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

- **ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మానం**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలను శనివారం కందుకూరులో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ యాదవ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న ఎంఎం కొండయ్య నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వీరిద్దరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు బీసీలకు మంచి గుర్తింపునిస్తున్నారని, అందులోనూ యాదవ సామాజికవర్గానికి ఆయన ఇచ్చే ప్రాముఖ్యత అందరికీ తెలిసిందేనన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎంతోమంది చీరాలకు వచ్చి తన విజయంకోసం పనిచేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఎంఎం కొండయ్య సతీమణి కొండమ్మ, యాదవసంఘం నాయకులు అప్పనబోయిన నరసింహం, వై. లక్ష్మీనారాయణ, జనిగర్ల నాగరాజు, పీలా శ్రీనివాసరావు, కుర్రా సూర్యనారాయణ, రామకృష్ణ, గెట్టిబోయిన మల్లికార్జున, పలువురు యాదవసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

- **మంత్రి స్వామికి ఎస్సీ సెల్ నేతల శుభాకాంక్షలు**

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా నియమితులైన కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిని కందుకూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు శనివారం అమరావతిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామిని కలిసిన వారిలో నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు జీ ప్రసాదరావు, కసుకుర్తి నవరత్నం, దువ్వూరి రమేష్‌చంద్ర, గౌడపేరు అనిల్ తదితరులు ఉన్నారు.

- **మున్సిపల్ మంత్రి నారాయణను కలిసిన ఇంటూరి**

రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొంగూరు నారాయణను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం రాత్రి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని నారాయణ నివాసానికి వెళ్లిన ఇంటూరి ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

మాలకొండ ఆదాయం రూ. 11,90,912

వలేటివారిపాలెం, జూన్ 15 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 11,90,912 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,750, కుంకుమార్చన ద్వారా రూ. 24,360, వివాహాల ద్వారా రూ. 6 వేలు, తలనీలాల ద్వారా రూ. 63,150, వాహనపూజల ద్వారా రూ. 5,680, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 4,05,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 640, రూముఅద్దెల ద్వారా రూ. 24,120, కవర్ల ద్వారా రూ. 7,800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,06,070, అన్నదానం ద్వారా రూ. 4,09,642, విరాళాల ద్వారా రూ. 30,600 ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

రాగి తీగ చోరీ యత్నం

లింగసముద్రం : మూడు భారీ నీటి పథకాలకు ఏర్పాటు చేసిన 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను చోరీ చేసేందుకు శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ప్రయత్నించారు. సాధ్యం కాక ట్రాన్స్‌ఫార్మర్‌ను కింద పడేశారు. దీంతో అందులోని ఆయిల్ కొంత కింద పడింది. విషయం తెలుసుకున్న కందుకూరు గ్రామీణ తాగునీటి సరఫరా డీఈ రామ్మోహన్‌రావు, ఏఈ రాజశేఖర్, ఏఈ షేక్ ఫిరోజ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దాన్ని బాగు చేయించేందుకు గుడ్లూరుకి తరలించారు.ఈ సందర్భంగా డీఈ రామ్మోహన్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ బాగయ్యేందుకు 3 రోజులు పడుతుందన్నారు.అప్పటి వరకు నీటి సరఫరా ఉండదని చెప్పారు.అయితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

పైపులైన్ మోటార్‌సెట్ చోరీ

గుడ్లూరు : గుడ్లూరులో కుళాయిలకు నీరు అందించేందుకు ఉప్పుటేరు వద్ద ఏర్పాటుచేసిన పైపులైన్ మోటార్ సెట్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మహేష్ శనివారం తెలిపారు. గతంలో కూడా ఈ మోటార్ సెట్ చోరీకి గురైందని తెలిపారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు సమాచారం అందచేశామన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం : మండలంలోని నేకునాంపురం సర్పంచి కొల్లూరు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మాధవి శనివారం విద్యుత్ సిబ్బందితో వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు వీధిలైట్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ కార్యదర్శి వీధిలైట్లు వేయించారు.

అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు !

బిట్రగుంట : బేతనీపేటలో దాతలు ఎవరైనా అభివృద్ధి పనులు చేయాలని ముందుకు వస్తే కొందరు నేతలు అడ్డుకునేవారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యేగా కావ్య క్రిష్టారెడ్డి (దగుమాటి) వచ్చారు... అభివృద్ధిని ఎవరు ఆపలేరని మండల టీడీపీ యువనేత గోచిపాతల సంజయ్ అన్నారు. బోగోలులోని బేతనీపేటలో పేరుకుపోయిన చెత్త, కంపచెట్ల తొలగింపును శనివారం ఆయన చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

గుడ్లూరు : అనుమానాస్పదంగా ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన గుడ్లూరు మండలంలోని నరసాపురం అటవీ ప్రాంతంలో శనివారం వెలుగుచూసింది. నరసాపురం ఎస్సీ కాలనీకి చెందిన తలపల రమణయ్య (60) శనివారం తెల్లవారుజామున బహిర్భుమికి ఇంటి దగ్గర నుంచి సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాడారు. అటవీ ప్రాంతంలో రమణయ్య మృతి చెంది పడి ఉండడాన్ని గమనించిన కొందరు పశువులకాపరులు మృతుడి బంధువులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా పోలేరమ్మ, గంగమ్మల గ్రామోత్సవం


పులివాహనంపై ఊరేగుతున్న గంగమ్మ

బిట్రగుంట, జూన్ 15 : బోగోలులోని యాదవపాలెంలో గంగమ్మ, పోలేరమ్మల తిరునాళ్లలో భాగంగా శనివారం అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అశ్వవాహనంపై ఆశీనురాలైన పోలేరమ్మకు ఆహ్వానం పలుకుతూ గంగమ్మ సన్నిధి చేరగా భక్తులు మంగళహారతులతో పూజించారు. గ్రామోత్సవానికి ముస్తాబైన అమ్మవార్లను గ్రామపెద్దగొల్ల చిలకపాటి జనార్దన్ యాదవ్, క్రిష్టయ్య, గ్రామకమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాళ్ల సుబ్రహ్మణ్యం యాదవ్, సామాజికకర్త కుందుర్తి వరప్రసాద్ దంపతులు దర్శించి పూజించారు. కీలుగుర్రాలు, బుట్టబొమ్మలు, అమ్మవార్ల వేషధారణ నృత్యాలతోపాటు వీరతాళ్ల నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి. పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవార్లకు గ్రామస్థులు కాయాకర్పూరం అందచేశారు.

ఎట్టకేలకు పాపిరెడ్డి చెరువులో ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కావలి, జూన్15: పట్టణంలోని పాపిరెడ్డి చెరువులో ఉన్న అక్రమ నిర్మాణాన్ని శనివారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాపిరెడ్డి చెరువులో వైసీపీ నేత అక్రమంగా నిర్మాణాన్ని చేపట్టారు. ఎన్నికలకు ముందు అక్కడ నిర్మాణం చేపట్టడంతో అప్పట్లో ఆంధ్రజ్యోతిలో 'కోటి రూపాయల స్థలం.. కబ్జాకు యత్నం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే అప్పట్లో నిర్మాణ వేగాన్ని మున్సిపల్ అధికారులు తగ్గించారు. దశలవారీగా పునాది మట్టానికి నిర్మాణం పూర్తి చేసిన తర్వాత దాన్ని పూర్తిగా నిలిపివేశారు. ఆ స్థలం పాపిరెడ్డి చెరువులో ఉండటంతో ఇరిగేషన్ అధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి పోలీసు బందోబస్తుతో అక్రమ నిర్మాణాన్ని శనివారం తొలగించారు. నిర్మాణాన్ని తొలగిస్తున్న సమయంలో ఆక్రమణదారులు అడ్డుకుని గొడవకు దిగినా, పోలీసులు వారిని పక్కకు నెట్టి నిర్మాణాన్ని తొలగించారు.

కొమ్మిలో బడిబాట

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం డేగ మహేష్ శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బడిబాట కార్యక్రమంపై విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. ముఖ్యఅతిథిగా లోక్‌సత్తా సభ్యుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కొమ్మి క్లస్టర్ అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కందుకూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి వీ రాము శనివారం పట్టణంలోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఖరీఫ్‌లో అన్నిరకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు విధిగా రసీదు ఇవ్వాలని విత్తన డీలర్లకు సూచించారు. విత్తన నిల్వలు, ధరలను సూచిస్తూ బోర్డులు ఉంచాలని చెప్పారు. విత్తన దుకాణాలలో నువ్వులు, కందులు, పెసర్లు, సజ్జల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ శాఖ కార్యాలయంలో పొద్దుతిరుగుడు విత్తన మినీకిట్లు ఉచితంగా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

సామూహిక జంతువధ, గోవధ నిషేధం

కావలి : సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు బక్రీద్ సందర్భంగా సామూహిక జంతువధ, గోవధలను నిషేధించామని కావలి ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌లు వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ముస్లింలు ఈ ఆదేశాలను గమనించాలన్నారు.

శ్రీశ్రీకి నివాళులు

కందుకూరు : విప్లవ కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించిన మహాకవి శ్రీశ్రీ అని పలువురు వక్తలు ఘనంగా నివాళులర్పించారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని పురస్కరించుకుని జాషువా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం కందుకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ముప్పవరపు కిషోర్, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, గాండ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్ నాయుడుకు సత్కారం

కావలిటౌన్ : వైద్యరత్న బిరుదాంకితులు డాక్టర్ ప్రభాకర్‌నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన్ను పలువురు వైద్యులు, ప్రముఖులు సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందిస్తు పేదల వైద్యుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ ప్రభాకర్‌నాయుడు 87వ జన్మదినం జరుపుకోవడం శుభపరిణామన్నారు. సత్కరించిన వారిలో అమ్మ ఆదరణ సంస్థ అధ్యక్షుడు నున్నా మురళీ, లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, ఖాదర్ బాష, డాక్టర్ హలీమౌలాలి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలి

● కలెక్టర్ హరినారాయణన్



వెంకటాచలం : భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వెంకటాచలం, జూన్ 15: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించి నూరు శాతం హాజరయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రానికి వస్తున్న చిన్నారుల హాజరుశాతం, అందిస్తున్న భోజనం, గుడ్లు, పాలు తది తర వివరాలను సీడీపీవోను అడిగి తెలుసు కున్నారు. కేంద్రానికి చిన్నారులందరూ సక్ర మంగా వచ్చేలా చూడాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వపరంగా అన్ని సౌక ర్యాలు కల్పించాలన్నారు. అనంతరం చెముడు గుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు, అందిస్తున్న భోజనం ఇతర వివరాలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు తప్ప కుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం పాఠశా లలో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో రామారావు, డిప్యూటీ డీఈవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పూర్ణచంద్రరావు, సీడీపీవో విజయలక్ష్మి, హెచ్‌ఎం అరుణ ఉన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : దళితవాడలో బడిబాట ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం: పిల్లలను అంగన్‌వాడీ బడిలో చేర్పించాలని తల్లులను కోరుతూ శనివారం బుచ్చి దళితవాడల్లోని అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి శకుంతల అధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ ఎన్‌ఎం శివలక్ష్మి, ఎఎస్‌హెచ్‌ఎ జి ఆదిశేషమ్మ పాల్గొన్నారు.

చాముండేశ్వరిదేవికి వైభవంగా గజవాహన సేవ



గజ వాహనంపై ఊరేగుతున్న చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట, జూన్ 15: మండలంలోని గంగపట్నం గ్రామంలోని చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజ వాహనంపై అమ్మవారు గంగపట్నం పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దుపై హర్షం

కోవూరు, జూన్ 15: రైతులకు నష్టం చేకూర్చే ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దుచేయడం హర్షణీయమని కోవూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్టాలిన్ అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రూపొందించిన ఈచట్టాన్ని నిరసిస్తూ న్యాయవాదులు ఆందోళన చేపట్టారని, చంద్రబాబునాయుడు యాక్టును రద్దు చేస్తూ సంతకం చేయడం హర్షణీయమన్నారు.

బుచ్చిలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 15: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసేందుకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాల్పడి స్థానికులు చూడడంతో పారిపోయినట్టు తెలిసింది. ఈఘటనలో విగ్రహం ఎడమచేతి బొటనవేలు, కోటుకు ఓవైపు కాలర్ విరిగి ముక్కలై పడివున్నాయి. గుర్తు తెలియని వ్యక్తుల్లో ఒకరు ముసుగుతో ఆ ప్రాంతంలో తిరగడం, ఎస్ఆర్ మస్తాన్ హోటల్ వీధిలోకి పరుగులు తీయడం సీసీ ఫుటేజీల్లో ఉన్నట్టు, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వైసీపీ నాయకులు తెలిపారు.

దాసరి వెంకట రమణయ్యకు డాక్టరేట్

వెంకటాచలం, జూన్ 15: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర విభాగం పరిశోధన విద్యార్థి దాసరి వెంకటరమణయ్యకు నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మండలంలోని సర్వేపల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణయ్య నాగార్జున యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతిదేవి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో ఉద్యానవన రైతుల సాంఘిక, సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి పరిశోధన చేశారు. దీంతో వెంకటరమణయ్యకు నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈసందర్భంగా వెంకటరమణయ్యను వర్సిటీ వీసీ పీ రాజశేఖర్, రిజిస్ట్రార్ బీ కరుణ, పరిశోధన విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి కిరణ్మయి, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి కె మధుబాబు అభినందించారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 15: పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సమగ్రశిక్ష అభియాన్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు అన్నారు. శనివారం బుచ్చి నగర పంచాయతీలోని రామచంద్రాపురంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటించారు. మండల కేంద్రంలో స్టూడెంట్స్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, రిసోర్సు సభ్యులు సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, వేణు, మున్వర్, అహ్మద్, బ్రహ్మారెడ్డి, విజయకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేలం పాటలు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

విడవలూరు, జూన్ 15: రామతీర్థంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించారు. ఇందులో కొబ్బరి చిప్పల సేకరణకు రూ. 27వేలు, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు రూ.63 వేలకు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట ఈవో శ్రీనివాసులు, రామతీర్థం ఈవో రామకృష్ణ, గుమస్తా వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు ఆవుల వాసు, తదితరులు పాల్గొన్నారు.

జ్వాలాముఖి అమ్మవారికి సోమిరెడ్డి పూజలు



జ్వాలాముఖి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, జూన్ 15: శ్రీజ్వాలాముఖి అమ్మవారి ఆశీస్సులు ప్రజలకు నిండుగా ఉండాలని సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరిగొండ శ్రీజ్వాలాముఖి అమ్మవారి దేవస్థానాన్ని శనివారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సందర్శించారు. దేవస్థానం ఆలయ అర్చకులు కార్యనిర్వహణాధికారి తాత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జ్వాలాముఖి జగన్మాత ఆశీస్సులు ప్రజలకు ఉండాలన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలోనే ఈ ఆలయ మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరుచేసి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల విశ్రాంతి కోసం ఆలయ పార్కును అభివృద్ధిపరిచామన్నారు. వైసీపీ పాలనలో ఆలయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ ప్రభుత్వ పాలనలో ఆలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి భక్తుల మనోభావాలు కాపాడుతామన్నారు. వరిగొండ గ్రామ స్థానిక టీడీపీ నేత మాజీ సహకార బ్యాంకు అధ్యక్షులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపుతో కోవూరుకి స్వర్ణయుగం

● టీడీపీ నేత బెజవాడ వంశీ కృష్ణారెడ్డి



విడవలూరు, జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపొందడంతో కోవూరు నియోజకవర్గం స్వర్ణయుగం కానుందని టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఊటుకూరులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కోవూరు నియోజవర్గం నుంచి టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసిన ప్రశాంతిరెడ్డి ప్రత్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డిపై భారీ మెజార్టీతో గెలుపొందిందన్నారు. ప్రశాంతిరెడ్డి ఇచ్చిన హామీలు తప్పకుండా అమలుపరచటం జరుగుతుందన్నారు. ఆమె నాయకత్వంలో మండలంలో తాగునీరు, రహదారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా కార్యకర్తలను మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థల్లో కూడా విజయడంకా మోగిస్తామని ఆయన తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : దండు



మండల పరిషత్ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, జూన్ 15: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనతో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మనుబోలు టీడీపీ నాయకులు దండు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మనుబోలులో శనివారం పంచాయతీ కార్యాలయం, రెండు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, మండలపరిషత్ కార్యాలయాలలో సీఎం ఫోటోను టీడీపీ నాయకులు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాని వెంకటరమణయ్య, చెల్లగిరి ప్రసాద్, రాజా గౌడ్, బండికట్టు రవీంద్ర, దామోదర్ రెడ్డి, గుంజి సతీష్, పొట్టేళ్ళ ప్రసాద్, రామకృష్ణ , నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీకి థాంక్స్ కార్యక్రమానికి భారీగా తరలిన నేతలు

వెంకటాచలం, జూన్ 15 : నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుండి గాంధీబొమ్మ వరకు శనివారం జరిగిన గాంధీకి థాంక్స్ కార్యక్రమానికి ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారధ్యంలో మండలంలోని కూటమి నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

తాగునీటి కోసం దళితుల ఆందోళన



తాగునీటికోసం ఆందోళన చేస్తున్న దళితులు

మనుబోలు, జూన్ 15: తమ కాలనీలో మూడు రోజులుగా కొళాయిల ద్వారా తాగునీరు రావడం లేదంటూ కాగితాలపూరు దళితులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి కొళాయి ఉన్నా తాగునీరు రాకపోతే ఏం ప్రయోజనమన్నారు. కరెంటు సక్రమంగా ఉండడం లేదన్నారు. ఒక్కో రోజు కరెంటు ఉన్నా తాగునీరు రాక అవస్థలు పడుతున్నామినరల్ వాటర్ క్యాన్ రూ.20 పెట్టి కొని తాగుతున్నామన్నారు. గుడ్డలు ఉతుక్కునేందుకు, స్నానాలకు నీళ్ళు లేక చెరువుల వద్దకు వెళ్ళాల్సి వస్తోందన్నారు. తాగునీరు రాకపోతే పంచాయతీ సిబ్బంది ఎవరూ బదులు చెప్పడం లేదన్నారు. రోజుకు వచ్చేది ఒక్కపూట మాత్రమేనని, అదికూడా మూడు రోజులకుపైగా రాకపోతే ఎలా ఉండాలని మండిపడ్డారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విమలను వివరణ కోరగా త్రీఫేస్ కరెంటు కేవలం ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు మాత్రమే ఉంటోంది. దీనివలన ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీళ్లు రాక కాలనీలకు తాగునీరు చేరడం లేదని తెలిసింది. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం

విడవలూరు, జూన్ 15: కల్లుగీత కార్మి కుల సంక్షేమమే లక్ష్యం అని కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షు డు తోట ప్రభాకర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం గౌడ్ తెలిపారు. ఇటీవల వరిణి పంచాయతీ వీరారెడ్డిపాళెంలో కల్లు గీస్తుండగా తేనెటీగలు దాడి చేయటంతో చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయ పడిన యర్రగల్ల వెంకటరమణయ్య కుటుం బాన్ని శనివారం వారు పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, మాధవ్, కల్లుగీత కార్మికుల సంఘం నాయకులు కొసూరు చినగోవిందు, నిమ్మల మల్లికార్జున దాసరి వెంకటేశ్వర్లు, పొసిన కిష్టమ్మ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలవ్వండి

నెల్లూరు(సాంస్కృతికం) : ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని వారం నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనం (టౌనుహాలు)లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రాణదాత పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో దిశ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామారావు, అందె శ్రీనివాసులు, ఎస్‌వీ.రమే ష్‌బాబు, షేక్.రియాజ్‌బాషా, కె.మురళీ మోహన్‌రాజు పాల్గొన్నారు.

మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు

● శుభాకాంక్షలు తెలిపిన నేతలు, అధికారులు



నారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోటంరెడ్డి, అజీజ్

నెల్లూరు(వైద్యం), జూన్ 15: నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని నివాసంలో శనివారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు అధికారులు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బొకేలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఆయన సోదరుడు అబ్దుల్ జలీల్ నారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి నారాయణను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గీతామయి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. దేవస్థానంలో 101 టెంకాలను కొట్టారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్‌లు అంచూరి జానకి, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నాయకులు తానే మస్తాన్, అంచూరు శ్రీనివాసులు నాయుడు, పెనుబర్తి సాయిరాం పాల్గొన్నారు. మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అనూరాధ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజానాయుడు, 28, 29వ డివిజన్‌ల నేతలు, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, టీడీపీ నేత కిలారి వెంకట స్వామి నాయుడు, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల విజేత, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య తదితరులు నారాయణకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నేత వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, డెంటల్ కళాశాలల ఏజీఎం చౌకిచర్ల భాస్కర్ రెడ్డి, టీడీపీ, జనసేన నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, మదన్ కుమార్‌రెడ్డి, ఆలియా, సుందరరామిరెడ్డి, కిశోర్, శ్రీనివాసులు, నరసాపురం ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రికి రంగనాథుడి ఆశీస్సులు

నెల్లూరు(సాంస్కృతికం) : మంత్రి పొంగూరు నారాయణ జన్మదినం సందర్భంగా తల్పగిరి రంగనాథ స్వామి ఆలయం నుంచి మంగళ ఆశీస్సులు అందుకున్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కిడాంబి జగన్నాథస్వామి స్వామివారి ప్రసాదం, వస్త్రాలు అందజేసి వేద ఆశీర్వాదాలు అందజేశారు.

● **రోగులకు పండ్లు పంపిణీ**



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రమాదేవి

నారాయణ పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి పొంగూరు రమాదేవి శనివారం నారాయణ ఆసుపత్రిలోని రోగులకు రోగులకు పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు. సిబ్బంది స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఏజీఎం శేఖర్‌రెడ్డి, హెడ్ రామారావు, సీఎఫ్‌వో సురేష్, డాక్టర్ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



● మంత్రి నారాయణకు పీహెచ్‌పీ అసోసియేషన్ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ గ్రూప్ జీఎం వేమిరెడ్డి భాస్కరరెడ్డి, ఏజీఎం చౌకచర్ల భాస్కరరెడ్డి, టీడీపీ నాయకులు పట్టాభి రామిరెడ్డి, వేణుగోపాల్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల కష్టం మరిచిపోను !

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 15: సార్వత్రిక ఎన్నికల్లో నా గెలుపు కోసం కృషి చేసిన జనసేన పార్టీ నేతలు, కార్యకర్తల కష్టం ఎప్పటికీ మర్చిపోనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఏసీ నగర్‌లో ఉన్న జనసేన పార్టీ నగర కార్యాలయానికి శనివారం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు వెళ్లారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు వారికి గజమాలతో స్వాగతం పలికారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు నెల్లూరులో చేపట్టిన రోడ్‌షో విజయవంతానికి జనసైనికులు ఎంతగానో శ్రమించారన్నారు. రూరల్ నియోజకవర్గంలో కష్టపడిన జనసైనికులకు నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో తగిన ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా పాల్గొన్నారు.

బలవంతంగా రాజీనామా చేయించారు

● వైసీపీ కార్పొరేటర్, ఆమె భర్తపై మాజీ వలంటీర్ల ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూన్ 15: నగరంలోని 41వ డివిజన్‌లో గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్లుగా పనిచేస్తున్న తమను ఆ డివిజన్ కార్పొరేటర్ కే.విజయలక్ష్మి, ఆమె భర్త మధుసూదన్, మరిది బాబీ మాపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా రాజీనామా చేయించారని మాజీ వలంటీర్లు సంతోష్, మరో 7 మంది శనివారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో వైసీపీ తరఫున ప్రచారం చేయాలని భయపెట్టారని, వారి ఒత్తిడితో రాజీనామా చేశామన్నారు. తమను భయపెట్టి, రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో స్నాతకోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 15 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ బాబు మాట్లాడుతూ ప్రతి ఏటా పాఠశాల పునఃప్రారంభం తర్వాత పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి సర్టిఫికెట్లు, తరగతి విద్యార్థుల గ్రూపు ఫొటో ఫైలులో ఉంచి ఇవ్వడం, అత్యున్నత మార్కులు సాధించిన వారికి మెమెంటో, దాతల సహకారంతో నగదు బహుమతి అందజేయడం ఆనవాయితీ అని తెలిపారు. ఈ ఏడాది సైన్స్ గణితంలో అత్యంత ప్రతిభ చూపించిన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున పాఠశాల పూర్వ విద్యార్థి రవీంద్ర అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కామాక్షిదేవి, పాఠశాల మీడియా ఇన్‌చార్జి సతీష్‌కుమార్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీసు పిల్లలు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

● ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 15: పోలీసు పిల్లలు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి వెదగాలని జిల్లా ఎస్పీ కె ఆరీఫ్ హఫీజ్ సూచించారు. ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం పోలీసు పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహించి కార్పొరేట్ కళాశాలలో ఉచిత అడ్మిషన్‌లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ 101 మంది పోలీసు పిల్లలకు 11 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత, రాయితీ అడ్మిషన్లు కేటాయించామన్నారు. ఉచిత అడ్మిషన్లు పొందడమే కాకుండా కష్టపడి చదవాలన్నారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐలు రామకృష్ణారెడ్డి, జాన్, ఆర్ఐ రాజారావు, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

పలువురి మృతికి వెంకయ్య సంతాపం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/(సాంస్కృతికం), జూన్ 15: జిల్లాలో పలువురు మృతికి మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. తనకెంతో ఆత్మీయుడైన బీజేపీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాలం బుజ్జిరెడ్డి అకాలమరణంతో ఎంతో విచారించానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

● వ్యక్తిగతంగా చిరపరిచితులైన వీఆర్ కళాశాల విశ్రాంత ఆంగ్ల బోధకుడు వి.రామచంద్రరావు మరణ వార్త తనను కలిచివేసిందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

వైద్య కళాశాల ప్రాంగణంలోని ఎర్రచందనం స్వాధీనం

నెల్లూరు(వైద్యం), జూన్ 15 : ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఎర్రచందనం దుంగలను శనివారం అటవీశాఖ అధికారులకు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది నవంబరు 7న సంభవించిన గాలివానలో ఒక్కడ ఉన్న ఎర్రచందనం చెట్టు నేలకొరిగి ఎండిపోయాయి. దీంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వైద్య కళాశాలకు చేరుకున్న అటవీశాఖ అధికారులు ఎర్రచందన చెట్టును నరికి దుంగలుగా మార్చి వాహనంలో తరలించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి శేషుతో పాటు వైద్యులు డాక్టర్ మస్తాన్‌బాషా, ఏవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 15 : నగరంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్, నెల్లూరు జిల్లా కార్మిక అధికారులతో కలసి శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలకు వెళ్లి బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే జరిగే పరిణామాలు వివరించారు. ప్రతి ఒక్కరూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ ఉపకమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సహాయ కార్మిక శాఖ అధికారులు, ఎన్‌టీవోలు, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 15 : నగరంలోని మాగుంటలేఅవుట్‌లోని శ్రీగోదా పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు విశేష పూజలు, అలంకారాలు, తిరువీధి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 19వ తేదీ అంకురార్పణ, 20న శేషవాహన అలంకారం, 21 హనుమంత వాహనం, 22 గరుడ వాహనం, 23న గజవాహన అలంకారం, 24న అశ్వవాహనం అలంకారం, 25న పవళింపు సేవలు జరుగుతాయని పేర్కొన్నారు.

త్వరలో అన్నా క్యాంటీన్లు

● రూ.5కే భోజనం ● మంత్రి నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 15: నెల్లూరులో అతి త్వరలో అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొ న్నారు. నగరంలోని మద్రాసు బస్టాండు, స్టోన్‌హౌస్‌పేట, బృందావనంలోని అన్న క్యాంటీన్ల భవనాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం పార్టీ హయాంలో 2.25 లక్షల మందికి రూ.5కే మంచి భోజనం అందించామని ఇలాంటి మంచి కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని చెప్పారు. చెన్నైలోని అమ్మ క్యాంటీన్లను కర్ణాటకలోని ఇందిర క్యాంటీన్లతోపాటు ఇతర రాష్ట్రాలలోని క్యాంటీన్లను సందర్శించి అక్కడ భో జనం చేసి అధికారులతో మాట్లాడడం జరిగిందని తెలిపా రు. ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడిలో రాజకీయ కోణం లేదు : డీఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 15: నెల్లూరు నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన దాడిలో రాజకీయ కోణం లేదని రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వీరరాఘవేంద్రరావుకు ఇందిరమ్మ కాలనీలో ఉన్న రెండు ప్లాట్లను పిన్ని ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమించి ఇళ్లు కట్టినట్లు ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఫిర్యాదులో తన స్థలంలో కట్టిన ఇళ్లను తొలగించేందుకు స్థానికులతో కలిసి వీరరాఘవేంద్ర రావు జేసీబీని తీసుకొని వెళ్లగా అక్కడకు చేరుకున్న పిన్ని ప్రసాద్ తనపై దాడి చేసి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మొద్దని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం చేసే ముందు పూర్తి వివరాలు తెలుసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు.

నేడు జనసేన విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించిన సందర్భంగా నగరంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేత నూనె మల్లికార్జున్ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 3 గంటలకు కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి ర్యాలీ ప్రారంభమై స్టోన్‌హౌస్‌పేట ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగుతుందన్నారు.

● **బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు**

నెల్లూరు(సాంస్కృతికం) : అల్లా దయతో రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతో షాలతో ఉండాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి కోరుకున్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా ఆమె బారాషహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 42వ డివిజన్ టీడీపీ మైనార్టీ నాయకులు మొహిద్దీన్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

మదర్ కేర్ యూనిట్ ప్రారంభం

నెల్లూరు(వైద్యం) : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రిచ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ యూనిట్‌ను, దానికి సంబంధించిన వాహనాన్ని శనివారం ఇండియన్ ఆయిల్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్‌కుమార్ ప్రాంభించారు. రిచ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రవికుమార్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

నెల్లూరు(వైద్యం), జూన్ 15 : వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నారాయణ దంత వైద్య కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ కన్నన్ పేర్కొన్నారు. శనివారం పీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య సతీమణి అంజనీదేవి 5వ వర్ధంతి సందర్భంగా హరిత వృద్ధాశ్రమంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి నాగసాయి సూరి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, మహబూబ్‌బాషా, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లోనూ బాదేశారు..



టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన వైసీపీ నేతలు

బదిలీల రద్దుతో ఆందోళనలో 148 మంది ఉపాధ్యాయులు

చిత్తూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు టీచర్ల వద్ద రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని బదిలీ చేయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 148 మంది టీచర్ల వద్ద డబ్బు తీసుకుని ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు తెప్పించారు. ఈ విషయం బహిర్గతం కావడంతో అక్రమ బదిలీలుగా అప్పట్లో ప్రతిపక్షాలు ఆరోపించాయి. రద్దు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే ఈ బదిలీలను రద్దు చేస్తూ ఈ మధ్య విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డబ్బులిచ్చి బదిలీ ఉత్తర్వులు పొందిన 148 మంది టీచర్ల ఆర్డర్లు రద్దయ్యాయి. ఒక్కో బదిలీకి సగటున రూ.4 లక్షలు తీసుకున్న వైసీపీ ప్రజాప్రతినిధులు ఇప్పుడు ముఖం చూపించడం లేదు. అటు బదిలీ అవ్వక, ఇటు డబ్బులు అందక బాధిత టీచర్లు లబోదిబోమంటున్నారు.

వైసీపీ విధానాల వల్లే బదిలీలు కోరిన టీచర్లు

వైసీపీ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను స్థానిక ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం.. అందులోని టీచర్ పోస్టులను రద్దు చేయడం తెలిసిందే. అలా పోస్టులు రద్దయిన టీచర్లను గతంలో జరిగిన బదిలీల్లో దూరంగా వేశారు. వారిలో కొందరు కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు వంటి కారణాలతో తిరిగి అదే మండలానికి రావాలని కోరుకున్నారు. వారి అవసరాన్ని అదునుగా భావించి వైసీపీ నాయకులు రూ.లక్షల్లో వసూలు చేశారు.

రూ.6 కోట్ల వసూలు

బదిలీ అవసరమైన టీచర్ల నుంచి ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు ఓ అంచనా. విద్యాశాఖ మంత్రి పేషీలో, సీఎం వోలో పరిచయాలు ఉన్నవారు ఈ వ్యవహారాన్ని డీల్ చేశారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఇందులో భాగస్వామ్యులై ఉన్నట్లు సమాచారం. ఒక్కో టీచర్ నుంచి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు.

భర్తకు తోడుగా ఉందామని..

తిరుపతిలో నివాసముంటున్న ఓ మహిళా టీచర్ నగరి నియోజకవర్గంలోని పాఠశాలలో పనిచేస్తున్నారు. టీచర్ అయిన ఆమె భర్తకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో భర్తకు దగ్గరగా ఉండాలని భావించి బదిలీ కోసం ఓ అధికార పార్టీ ప్రజాప్రతినిధిని ఆశ్రయించారు. విద్యాశాఖ మంత్రి పేషీలో ప్రయత్నించి రూ.3.50 లక్షలకుపైగా ఖర్చు పెట్టుకున్నారు. ఎట్టకేలకు ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. తాజాగా అవి రద్దు కావడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

రూ.4 లక్షలకు వడ్డీ కడుతున్న మహిళా టీచర్

జీడీనెల్లూరు నియోజకవర్గంలో పనిచేసే ఓ మహిళా టీచర్ 117 జీవో కారణంగా పనిచేస్తున్న పాఠశాలలో పోస్టు రద్దు కావడంతో బదిలీకి అయ్యారు. అదే మండలంలో పనిచేస్తున్న ఆమె భర్తను, కుటుంబాన్ని వదిలి పలమనేరు నియోజకవర్గంలోని ఓ పాఠశాలలో చేరారు. దూర ప్రాంతం కావడంతో రోజూ ప్రయాణం చేయలేక, 7వ తరగతి చదువుతున్న కుమారుడిని తోడుగా ఉంచుకుని పలమనేరులో అద్దెకు ఉంటూ విధులకు వెళ్లి వచ్చేవారు. ఆరు నెలల కిందట ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన మామ, వృద్ధాప్యంలో ఉన్న అత్తను చూసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎలాగైనా ఇంతకు ముందు పనిచేస్తున్న మండలానికి బదిలీ కావాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. లాభం లేకపోయింది. అధికార పార్టీకి చెందిన ఓ నేతను సంప్రదించగా రూ.4 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఆ మేరకు డబ్బు వడ్డీకి తెచ్చి ఏప్రిల్‌లో బదిలీ ఉత్తర్వులు సాధించారు. కుటుంబానికి దగ్గరగా వచ్చానని సంతోషించే లోపే ఆ బదిలీలు రద్దు కావడం, వైసీపీ నేత రూ.4 లక్షల ప్రస్తావన తేకపోవడంతో ఆమె ఆవేదన చెందుతున్నారు. నెల నెలా వడ్డీ కట్టుకుంటున్నారు.

అనధికార తట్టలకు బ్రేక్

తిరుమల కొండపై మొదలైన ప్రక్షాళన



వరాహస్వామి విశ్రాంతి గృహం వద్ద అనధికార తట్టలను మూసివేయిస్తున్న అధికారులు

తిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచే ప్రక్షాళన మొదలవుతుందని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు ప్రకటించడంతో టీటీడీ అధికార యంత్రాంగంలో చురుకు మొదలైంది. తిరుమలలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన అనధికార తట్టల (చిన్న షాపులు)ను తొలగించే పని ప్రారంభమైంది. విజిలెన్స్, హెల్త్, రెవిన్యూ విభాగాల టాస్క్‌ఫోర్ బృందం శనివారం తిరుమలలో పలు చోట్ల ఆకస్మిక దాడులు చేసింది. వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనం వద్దనున్న అనధికార తట్టలను మూసివేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ముందు కూడా దాడులు కొనసాగుతాయని కాలం చెల్లిన లైసెన్సులతో వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చంద్రబాబు తిరుమలకు వచ్చినపుడు ఆక్రమణలు, అనధికార తట్టల గురించి స్థానిక టీడీపీ కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే తిరుమలలో ప్రక్షాళన మొదలైనట్టు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా తట్టలు

నిబంధనల ప్రకారం టీటీడీ నుంచి లైసెన్సులు ఉండేవారే తిరుమలలో వ్యాపారాలు చేసుకోవాలి.అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తట్టలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తట్టలు పెట్టి వ్యాపారాలు మొదలుపెట్టారు. అధికారికంగా లైసెన్సులు పొందినవారి జీవనాన్ని దెబ్బకొట్టేలా అడ్డదిడ్డంగా తట్టలు పెట్టి వ్యాపారాలు చేస్తూ హల్‌చల్ చేశారు. వీరిని టీటీడీ అధికారులు కూడా నియంత్రించలేకపోయారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం నుంచి బయటకు వచ్చే ప్రదేశంలో, వరాహస్వామి విశ్రాంతి గృహం ముందు, షాపింగ్‌కాంప్లెక్స్ వద్ద డీఎంబీ రోడ్డు వంటి ప్రాంతాల్లో తట్టలు భారీగా పెరిగిపోయాయి. వ్యాపారం బాగా జరిగే కొన్ని ప్రాంతాల్లో తట్ట నడుపుకునేవారు దాని యజమానికి రోజుకు రూ.వెయ్యి కూడా చెల్లిస్తుంటారు. ఇంత ఆదాయం వచ్చే మార్గం కావడంతో నాయకులంతా తట్టల మీద పడ్డారు.ఐదేళ్ల వైసీపీ వారు తట్టలు నడుపుకున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడిప్పుడే టీడీపీ వారు కూడా అనధికార తట్టలు పెట్టిస్తున్నారు. హోటళ్ల తరహాలో సాగుతున్న ఈ వ్యాపారాలు నిజమైన అనుమతులున్నవారి వ్యాపారాలను దెబ్బతీస్తుండడంతో వారు లబోదిబోమంటున్నారు.





సినీ నటులు సాయిధరమ్ తేజ్, ప్రగ్యా జైస్వాల్ శనివారం ఉదయం తిరుమల వెంకన్నను దర్శించుకున్నారు.

స్మార్ట్ క్లాస్‌రూమ్స్ ప్రారంభం



డిజిటల్ క్లాస్ రూమ్‌లో ఎంఈవో ప్రేమలత తదితరులు

ఏర్పేడు, జూన్ 15:ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం, పాపానాయుడుపేట, మర్రిమంద, ఆమందూరు, చిందేపల్లె ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్స్ శనివారం ప్రారంభమయ్యాయి. టీచ్ ఫర్ ఛేంజ్ చైర్‌పర్సన్ మంచు లక్ష్మి , శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వీటిని ప్రారంభించారు. ఒక్కో పాఠశాలకు రూ.లక్ష విలువైన డిజిటల్ టీవీ, టేబుల్స్ కుర్చీలు, పెయింటింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో పది స్మార్ట్ కాస్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని టీచ్ ఫర్ ఛేంజ్ తరపున లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.టీడీపీ నాయకుడు ధనంజయులు నాయుడు, ఎంఈవో ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



మోదుగులపాళెంలో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న మంచు లక్ష్మి, సుధీర్‌రెడ్డి

నేడు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

- **తిరుపతిలో 11 పరీక్షా కేంద్రాలు**
- **హాజరు కానున్న 5,518మంది అభ్యర్థులు**

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం తిరుపతి నగరంలోని 11 కేంద్రాల్లో జరగనున్నాయి. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సజావుగా పరీక్ష రాసేలా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పరీక్షకు 5,518మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డు కూడా వెంట తీసుకెళ్లాలి. బస్టాండు నుంచి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా బస్సులను ఏర్పాటు చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. సమస్య లెదురైతే 90006 65565 నెంబరుకు ఫోన్ చేయొచ్చు.

టీటీడీ ఈవోగా శ్యామలరావు బాధ్యతల స్వీకారం నేడు

తిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా శ్యామలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన్ను టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈక్రమంలో ఆయన ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని శ్రీవారి ఆలయంలోకి వెళ్లనున్నారు. అక్కడ జేఈవో వీరబ్రహ్మం నుంచి ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం.

మద్యం మత్తులో దారుణహత్య

- **పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు**



ప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 15: అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో ఓ డ్రైవర్‌ను సుత్తితో తలపై బాది కత్తులతో నరికి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రగిరి మండలం ముంగిలిపట్టుకు చెందిన ప్రైవేటు వాహన డ్రైవర్ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం ఆటోనగర్ సమీపంలోని చైతన్యపురం కాలనీలో ఉండేవాడు. ఆ తర్వాత కాపురాన్ని చంద్రగిరి మండలం ముంగిలిపట్టుకు మార్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఆటోనగర్‌లో ఉంటున్న స్నేహితుడు బాలకృష్ణను కలవడానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో తనకు తెలిసినవారు ఐదుగురు మద్యం తాగుతుంటే అక్కడికెళ్లి వారితో మాట్లాడాడు. ఈ ఐదుగురిలో పాత నేరస్తుడు వెంకటేష్ కూడా ఉన్నాడు. అనంతరం బాలకృష్ణ వద్దకొచ్చి మాట్లాడాక ఇంటికి బయల్దేరాడు. అయితే ఇంతకు ముందు కలిసినవారు ఇంకా అక్కడే కూర్చొని మద్యం తాగుతున్నారు. దాంతో ప్రసాద్ కూడా వారితో కలిసి మద్యం తాగాడు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగి గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న పాత నేరస్తుడు వెంకటేష్. మిగిలినవారితోకలిసి ప్రసాద్ తలపై సుత్తితో బాదాడు. ఆ తర్వాత పదునైన కత్తులతో మెడపై అతి కిరాతంగా నరికి చంపేశారు. స్థానికులు వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ రామారావు, సిబ్బంది పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. అలిపిరి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పాత నేరస్తుడు వెంకటేష్‌పై పలు కేసులు ఉన్నాయని అలిపిరి సీఐ చెప్పారు. జైలుకు కూడా పోయి వచ్చాడన్నారు. ఐదుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు.

గూడూరు మార్కెట్‌కు థైవాన్ రకం నిమ్మకాయలు



గూడూరు అర్బన్, జూన్ 15 : గూడూరు నిమ్మ మార్కెట్‌లో థైవాన్ రకం నిమ్మకాయలు దర్శనమిస్తున్నాయి.ఇవి స్థానిక నిమ్మకాయల కంటే అధిక పరిమాణంలో వుంటాయి. స్థానిక నిమ్మకాయ 50 గ్రాముల వరకూ బరువుంటుంది. థైవాన్ రకం 100 గ్రాముల నుంచి 150 గ్రాముల వరకు తూగుతుంది. ఇవి చూసేందుకు చీనీపండ్లను పోలివుంటాయి. సాధారణ నిమ్మకాయల కంటే ఇవి ఎక్కువ బరువు తూగుతాయని సమీప ప్రాంతాలకు చెందిన రైతులు సాగు చేపట్టారు. అయితే సాధారణ రకం నిమ్మకాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. థైవాన్ రకం నిమ్మకాయలు చూసేందుకు పెద్దవిగా ఉన్నా ఎక్కువ రోజులు నిల్వ ఉండకపోవడంతో వీటికి గిరాకీ లేకుండా పోయింది. సాధారణ రకం నిమ్మకాయలు శనివారం కిలో రూ.50 నుంచి రూ.70 పలకగా, థైవాన్ రకం నిమ్మకాయలు కిలో రూ. 20 నుంచి రూ.40 వరకు పలికాయి.

వేటకు వెళ్లిన మత్స్యకారులు



వలలను పడవల్లోకి చేర్చుకుంటున్న మత్స్యకారులు

కోట, జూన్ 15 : మండల పరిధిలోని మత్స్యకారులు 61 రోజుల విరామం తరువాత శని వారం చేపలు పట్టుకునేందుకు సముద్రంలోకి వెళ్లారు. కుల, ఇష్టదైవమైన గంగమ్మకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వేటకు బయల్దేరారు. కోట, వాకాడు, చిల్లకూరు మండలాలలోని 1800 మంది మత్స్యకారులు బోట్లలో వలలతో చేపల వేటకు వెళ్లారు. ఆయా మత్స్యకారులను కుటుంబ సభ్యులు దీవించి సురక్షితంగా వెళ్లి రావాలని ఆశీర్వదించారు. పస్తులతో ఉంటూ వచ్చిన మత్స్యకారులు వేట ప్రారంభం కావడంతో ఆయా మత్స్యకార గ్రామాల్లో ఆనందాలు వెల్లివిరిశాయి.

కార్మిక, కర్షకులకు అత్యధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ



విజయశ్రీ, నెలవలను సన్మానిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నాయుడుపేట, జూన్ 15: కూటమిలో కర్షకులకు, దేశ ప్రగతికి తోడ్పాడే కార్మికులకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో శనివారం ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ తిరుపతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శేఖర్, సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో అధ్యక్షుడు డి.పోలయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను సత్కరించారు. ఆర్టీసీ డిపోల్లో అవసరమైన బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడు తున్నారన్నారు. తిరుపతి సెక్టార్‌లో హైర్ బస్సులను ప్రవేశపెట్టిన 6 నెలలకే నిలిపివేశారన్నారు. వాటి స్థానంలో కొత్త ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. సూళ్లూరుపేట నుంచి నేరుగా తిరుమల, మదనపల్లి, బెంగళూరు, పలమనేరు, హైదరాబాదులకు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డిపోల్లో రద్దైన సర్వీసులను పునరుద్ధరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు హెచ్ వెంకటేశ్వర్లు, ఎన్.శంకరయ్య, కె.ఎస్.మన్యం, ఎస్.కె.షాజహాన్, పి. రమణయ్య, బి.మనోహర్ తదితరులు ఉన్నారు.

టీడీపీలో మహిళలకు పెద్దపీట

నాయుడుపేట టౌన్, జూన్ 15: టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట వేస్తారని నాయుడు పేట మాజీ ఎంపీపీ కన్నెమ్మ అన్నారు. నాయుడుపేటలో శనివారం తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు సుజాతమ్మ జన్మదినం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ హయంలో పొదుపు గ్రూపులను బలోపేతం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారన్నారు. ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకంలో మహిళలను భాగస్వామ్యంచేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు.

బొజ్జలకు పేట నాయకుల సన్మానం

నాయుడుపేట, జూన్ 15 : శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే గా ఘన విజయం సాధించిన బొజ్జల సుధీర్‌రెడ్డిని శనివారం శ్రీకాళహస్తిలో నాయుడుపేట టీడీపీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో సుధీర్‌రెడ్డి తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్, జి.సుధీర్‌రెడ్డి ఉన్నారు.

విధుల నుంచి మున్సిపల్ టీపీబీవో తొలగింపు

నాయుడుపేట, జూన్ 15: నాయుడుపేట పురపాలక సంఘంలో వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి, టీపీబీవో(టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఆఫీసర్) ఇన్‌చార్జిగా పనిచేస్తున్న కె. వెంకటేష్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి శనివారం తెలిపారు. సదరు వెంకటేష్ మున్సిపాలిటీలోని 15 వార్డుల పరిధిలో అనధికార కట్టడాలు, లేఅవుట్లపై సకాలంలో చర్యలు తీసుకోనందున అతని నిర్లక్ష్య వైఖరిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు సరైన సంజాయిషి ఇవ్వనందున వెంకటేష్‌ను జూన్ 14నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా మున్సిపాలిటీ టీపీబీవోగా ఎస్‌కె హుమయూన్ బాషాకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో డెబిట్ నుంచి స్త్రీనిధి రుణాలు

కోట, జూన్ 15 : స్త్రీనిధి రుణాల నగదును ఆటో డెబిట్ ద్వారా ఆయా ఖాతాలకు నేరుగా చేరు తుం దని క్రాంతి పథం కమ్యూనిటీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ చెప్పారు. మండలం లోని ఊనుగుంటపాళెంలో శనివారం సంఘ అధ్యక్షురాలు, పొదుపు మహిళలతో స్త్రీనిధి రుణాల మంజూరు, రికవరీలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ... స్త్రీనిధి రుణాలు చెల్లింపుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రూపునకు రుణం అందేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. రుణాల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం చేయకూడదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త స్త్రీనిధి రుణాలను ఇచ్చేందుకు గ్రూపులపై సర్వే నిర్వహించామన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం

గూడూరు, జూన్ 15: ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధిం చడంతోపాటు జనసేన అధినేత పవన్ ఉపముఖ్యమంత్రి పదవిని పొందిన సందర్భంగా ఆదివారం నెల్లూరు లో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జనసేన నాయకుడు మునిగిరీష్ అన్నారు. శనివారం డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి అజయ్ ఆధ్వర్యంలో జరిగే బైక్ ర్యాలీకి గూడూరు నుంచి తరలిరావాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు సుందర్‌మహల్ థియేటర్ నుంచి నెల్లూరుగా బయలుదేర నున్నామని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇంద్రవర్ధన్, చంద్రనీల్, సూర్యప్రకాష్, నయ్యూం, వెంకటేశ్వర్లు, విజయ్, శీను, మధు, రవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లుకు టీడీపీ నాయకుల అభినందన

తడ, జూన్ 15 : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మండల టీడీపీ నాయకులు అభినందించారు. శనివారం మచిలీపట్నంలో మంత్రి స్వగృహంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందించారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడంతోపాటు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువాతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీధర్, నాయకులు ఏకాంబరం, జయపాల్ తదితరులు ఉన్నారు.

పరిపాలనా దక్షుడు చంద్రబాబు

● మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట టౌన్, జూన్ 15: నాల్గోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు పరిపాలనా దక్షుడని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం పురపాలకశాఖ మంత్రి నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికే ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టారన్నారు. ప్రమాణస్వీకారం చేసిన తక్షణమే 5 ఫైళ్లపైన సంతకం చేశారన్నారు. సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఏ.రమేష్, నాగేంద్రరెడ్డి, చక్రపాణి, గోపాల్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, చెంగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై చర్యలు

తడ, జూన్ 15: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద స్థానిక పోలీసులతో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్‌ను పురస్కరించుకొని రాష్ట్రం నుంచి అక్రమంగా పశువుల రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయనతోపాటు స్థానిక ఎస్ఐ నరసింహరావు కూడా ఉన్నారు.

చంద్రబాబు హామీపై ప్రజల్లో ఆశలు

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతానని హామీ



ఏప్రిల్ 20న జరిగిన సభలో హామీ ఇస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

గూడూరు, జూన్ 13: ఎన్నికల ప్రచారం సందర్భంగా గూడూరుకు విచ్చేసిన చంద్రబాబు టీడీపీ అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలుపుతామని హామీ ఇచ్చారు. బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నేపథ్యంలో గూడూరు నియోజకవర్గ ప్రజల్లో ఆయన ఇచ్చిన హామీపై ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన చేసిన సమయంలో గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేశారు. దీంతో అప్పట్లో ఈ నిర్ణయంపై ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చింది. నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ప్రధానంగా గూడూరు నుంచి నెల్లూరుకు 35 కిలోమీటర్లు దూరం కావడం, 40 నిమిషాలు మాత్రమే ప్రయాణ సమయం కావడంతో వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రజలకు కానీ, అటు పలు శాఖల అధికారులుకు సౌకర్యవంతంగా ఉండేది. జిల్లా కేంద్రంలోని ఏ కార్యాలయానికి తమ సమస్యల పరిష్కారానికి ప్రజలు వెళ్లాలన్నా, తక్కువ సమయంతో పాటు తక్కువ బస్సు చార్జీలతో వెళ్లే వెసులుబాటు ఉండేది. జిల్లాల పునర్విభజన అనంతరం గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపారు. దీంతో గూడూరు నుంచి తిరుపతికి 100 కిలోమీటర్లు దూరం ఉండడం, ప్రయాణ చార్జీలు నెల్లూరు కంటే ఎక్కువగా ఉండడం, మూడు గంటలకు పైగా సమయం పడుతుండడంతో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు, అధికారులు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందేవారు. దీంతో ఇప్పటి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ విషయాన్ని అప్పట్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 20న గూడూరులో నిర్వహించిన చంద్రబాబు సభలో ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో చంద్రబాబు సభావేదిక నుంచి టీడీపీ అధికారంలోకి రాగానే, తాను ముఖ్యమంత్రిని కాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతానని ప్రకటించారు. దీంతో సభలో ప్రజలు హర్షధ్వానాలతో చంద్రబాబుకు అభివాదం చేశారు. ఇదే అంశాన్ని యువగళం పాదయాత్రలో నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో లోకేశ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కూడా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తానని వెల్లడించి ఉన్నారు. దీంతో గూడూరు నియోజకవర్గ ప్రజలలో సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబు ఇచ్చిన హామీపై ఆశలు చిగురిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన

అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు ● రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ

నెల్లూరులో 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో భారీ ర్యాలీ



గాంధీ బొమ్మ వద్ద ప్రసంగిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), జూన్ 15: రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ప్రజారంజక పాలన జరుగుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 'థ్యాంక్స్ టూ గాంధీజీ' పేరుతో వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలుకుతూ ప్రజలంతా తమ ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, యువత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేశారన్నారు. అంతేగాక ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నిటికీ శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ... అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసిన తరుణంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఓ ఎంపీ, పదిమంది ఎమ్మెల్యేల విజయంతో చారిత్రాత్మిక తీర్పు ఇచ్చిన ప్రజల రుణం తీసుకుంటామన్నారు. మాజీ మంత్రి కాకాణి ఆధ్వర్యంలో జిల్లాలో భూ కుంభకోణం, మైనింగ్ దోపిడీ, జగనన్న కాలనీల పేరుతో అక్రమాలు, ఇరిగేషన్‌లో జరిగిన దోపిడీలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలను వెలికితీస్తామన్నారు. మంత్రి నారాయణ ఇప్పటికే దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం నిర్వహించి ర్యాలీగా గాంధీబొమ్మ వరకు చేరుకున్నారు. అక్కడ గాంధీజీకి పాలభిషేకం చేసి, బాణాసంచాతో సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పాశం సునీల్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో అవకతవకలపై చర్యలు: కురుగొండ్ల



వెంకటగిరిలో అన్నక్యాంటీన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 15 : పట్టణంలో గుంటకట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ట్రాక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... గుంటకట్టలో బోట్ షికార్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కాగా ఇప్పటి వరకు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కోసం వినియోగిస్తున్న అన్న క్యాంటీన్ పరిశీలించి అందులో ఫర్నిచర్‌ను తొలగించాలన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. అందుకే తాను తన సొంత నిధులతో వెంకటగిరి, రాపూరు మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి మూడేళ్ల పాటు పేదల ఆకలి తీర్చానన్నారు. పి.రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, పి.విశ్వనాథనాయుడు, పి. చంద్రమౌళిరెడ్డి, టి.శివారెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి, ఏ.సత్యనారాయణ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు ఎమ్మెల్యే పాశం అభినందనలు





నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ - నారాయణకు వేనాటి సతీష్ రెడ్డి తదితరుల సన్మానం

గూడూరు/ చిట్టమూరు, జూన్ 15: మున్సిపల్ శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నారాయణ జన్మదినం సందర్భంగా శనివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్‌శాఖ మంత్రిగా పని చేసిన నారాయణ మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. తిరిగి అదే శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో వాటి అభివృద్ధికి ఆయన సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో గూడూరు నాయకులతో పాటూ చిట్టమూరు మండల టీడీపీ కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, ఎం. జనార్దన్‌రెడ్డి, ఎస్.రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సూళ్లూరుపేట: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన వేడుకలను శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటంతో ఉన్న కేక్‌ను కట్‌చేసి పంచి పెట్టారు. పార్టీ బీసీ సెల్ నాయకుడు చిట్టేటి పెరుమాల్ ఆధ్వర్యంలో నెల్లూరుకువెళ్లి అక్కడ నారాయణను సన్మానించారు. నాపా మునిరాజా, వి.రమేష్, పి.చంద్రారెడ్డి, వి.జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమవరానికి రుణపడి ఉంటాం: నెలవల



విజయశ్రీ, నెలవలను సన్మానిస్తున్న భీమవరంవాసులు

నాయుడుపేట టౌన్, జూన్ 15: తన సొంత గ్రామం భీమవరానికి రుణపడి ఉంటామని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయశ్రీతో కలసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విజయశ్రీ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొట్టమొదటిసారిగా సొంత గ్రామమైన భీమవరానికి వెళ్లడంతో గ్రామస్తులు భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ... తన రాజకీయ అరంగ్రేటం భీమవరం సర్పంచ్‌తోనే మొదలైందన్నారు. ఆనాడు భీమవరంవాసులు తనను గెలిపించారన్నారు.

సిలికా భూముల పరిశీలన



చిల్లకూరు, జూన్ 15: మండలంలోని మోమిడి గ్రామంలో శనివారం మైనింగ్ ఏడీ రంగకుమార్, మైనింగ్ విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ సిలికా భూములను లు పరిశీలించారు. ముందుగా తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులుతో సమావేశమై మోమిడిలోని సిలికా భూముల్లో సర్వే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, మైనింగ్ అధికారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన సిలికా అక్రమ తవ్వకాలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతో సర్వే చేపట్టి నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే మోమిడిలో సిలికా భూములను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ, పట్టా భూముల్లో ఎంతమేర సిలికా తవ్వకాలు చేపట్టారనే విషయాలపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు. వారి వెంట సర్వేయర్ భరత్ కూడా ఉన్నారు.

తాగు, సాగునీరందేలా చర్యలు తీసుకోండి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీపీ

సూళ్లూరుపేట, జూన్ 15: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ ఏ.అనిల్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చేది వ్యవసాయ సీజన్ కాబట్టి రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మన్నెముత్తేరి వద్దనున్న చెక్‌డ్యాం గత ఏడాది డిసెంబరులో వచ్చిన వరదకు పూర్తిగా దెబ్బతిన్నా ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. ఈ చెక్‌డ్యాం కింద దాదాపు 8 పంచాతీయలకు సాగునీరందుతుందని సత్వరమే మరమ్మతులు చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అదే విధంగా ఆర్టీసీ అధికారులు తీర ప్రాంత గ్రామాల్లో ఒక బస్సు నైట్‌హాల్టు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సుల వేగాన్ని నియంత్రించడమేకాకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను విద్యాశాఖ అధికారులు పరిశీలించాలని ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. అదే విధంగా వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా సంబధిత పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు సుప్రియ, ఏవో కవతి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు ఉమామహేశ్వరి, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

సప్లై ఛానల్ తవ్వించి ఆదుకోండి

● సాగునీటి కాలువ పూడ్చివేతపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెళ్లకూరు, జూన్ 15: మండలంలోని రావులపాడు చెరువుకు సాగునీరు సరఫరా అయ్యే కాలువను తిరిగి తవ్వించి ఆదుకోవాలని లేకుంటే పొలాలు బీడుగా మారిపోతాయని రైతులు తహసీల్దార్ కేవీ ఆర్వీ ప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేశారు. చెంబేడు సప్లై ఛానల్ ద్వారా రావులపాడు చెరువుకు సాగునీరందించే కాలవను జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పూడ్చివేశారు. అయితే ప్రత్యామ్నాయ మార్గం చూపలేదన్నారు.. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో చెరువుకు నీరు చేరదన్నారు. దీంతో రావులపాడు చెరువు కింద ఉన్న వందలాది ఎకరాలు బీడు పెట్టుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ ప్రసాద్ రావు మాట్లాడుతూ... హైవే అధికారులతో చర్చించి కాలువను తవ్విస్తామని చెప్పారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం



కోట, జూన్ 15 : మండల పరిధిలోని కొండుగుంటవద్ద శనివారం ఆర్టీసీ బస్సు పొలాల్లోకి దూసుకు వెళ్లడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. వాకాడు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు నెల్లూరు వైపు వెళ్తోంది. కొండుగుంట వద్ద ఒక్కసారిగా పొలాల్లోని గొర్రెలు పరుగులు తీస్తూ రోడ్డుపైకి వచ్చాయి. వాటితోపాటు గొర్రెలకాపరి రావడంతో వాటిని తప్పించబోయి బస్సును డ్రైవర్ చాకచక్యంగా పొలాల్లోకి దింపేశాడు. ఈ సంఘటనలో గొర్రెలకాపరికి స్వల్పగాయాలు కాగా ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోట, జూన్ 15: మండల పరిధిలోని చిట్టేడులోని గిరిజన బాలుర సంక్షేమ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్ శేషవర్ధన్ శనివారం తెలిపారు. కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీలో 24, బైపీసీలో 34, హెచ్‌ఈసీలో 24, ఒకేషనల్ కోర్సులో 13 వంతున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన యానాది, ఎరుకుల విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లా వాసులై ఉండాలన్నారు. వివరాలకు నెం. 9441033361లో సంప్రదించాలన్నారు.

మాదిగల కవాతును విజయవంతం చేయండి

నాయుడుపేట టౌన్, జూన్ 15: మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిసింద్రిమాదిగ పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జూలై 7న వరంగల్‌లో చేపట్టబోయే కవాతుకు నియోజకవర్గం నుంచి వేలాదిమంది తరలివెళ్లి విజయవంతం చేద్దామని కోరారు. కె. రవిమాదిగ, శ్రీనివాసులుమాదిగ, హేమంత్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సూళ్లూరుపేట, జూన్ 15: అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మికి చిరంజీవి సేవా సంఘం ఆర్థికం సాయం అందజేసింది. పట్టణంలోని గణపతి నగర్‌కు చెందిన లక్ష్మి నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సలు చేయించుకుంటోంది. అక్కడి వైద్యులు ఆమె కడుపులో 5 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేయాలని పేర్కొన్నారు. రూ.50 వేలు పైబడి ఖర్చు అవుతుందని తెలిపారు. సమాచారం అందుకున్న చిరంజీవి సేవా సంఘ అధ్యక్షుడు మా బాషా స్పందించి శనివారం వారి ఇంటికెళ్లి ఆమె వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు.

కల్లూరులో జనసేన ఫ్లెక్సీలకు నిప్పు



వాకాడు, జూన్ 15: మండలంలోని కల్లూరు పంచాయతీలో డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆయన అభిమానులు శనివారం రోడ్డెక్కారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్ మాట్లాడుతూ... సాక్ష్యాత్తు డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి నిప్పుపెట్టి సైకో వైసీపీ నాయకులు కించపరచడం మంచిపద్ధతి కాదన్నారు. ఇలాంటి అకృత్యాలు చేయడంవలనే వైసీపీ అధఃపాతానికి దిగ జారిపోతుందన్నారు. ఇకనైనా వైసీపీ నాయకులు సౌమ్యంగా నడుచు కోవాన్నారు. ఫ్లెక్సీలను తగులపెట్టడంపై పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటివి పునరావృత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ పవన్‌కల్యాణ్ హెచ్చరించారు.

మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే విజయశ్రీ



నాయుడుపేట/టౌన్, జూన్ 15 : రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణను సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ దంపతులు సన్మానించారు. శనివారం మంత్రి నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని మంత్రి స్వగృహంలో విజయశ్రీ, పార్థసారథి దంపతులు మంత్రికి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ముఖేష్‌ను ఆదర్శంగా తీసుకోండి



వెంకటగిరిటౌన్, జూన్ 15: ఇటీవల నీట్‌లో మొదటి ర్యాంక్ సాధించి వెంకటగిరి పేరును నిలబెట్టిన వి.ముఖేష్ చౌదరిని ఆదర్శంగా తీసుకోవాలని రాజా కుటుంబీకులు, ఏసీఏ మాజీ చైర్మన్ సర్వజ్ఞ యాచేంద్ర అన్నారు. శనివారం స్థానిక రాజా ప్యాలెస్‌లో ముఖేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని గమ్యం చేరాలని కోరారు.